# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 26-8-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 21 పేజిలు:6 వెల: రూ.1/-




బాల సాహిత్య పురస్కార విభాగంలో ఏకగ్రీవంగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన సందర్భంగా గురువారం పత్తిపాక మోహన్ గారిని తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎం. నారాయణ శర్మ,కె.పి.అశోక్ కుమార్, జి.హెచ్.ఎం.సి అధికారి యాదగిరి రావు, కోట్ల వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

## డాక్టర్ పత్తిపాక మోహన్‌కు మంత్రి కేటీఆర్ అభినందనలు





హైదరాబాద్, ఆగష్టు 25: కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కారానికి రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన డాక్టర్ పత్తిపాక మోహన్ ఎంపికవడం పట్ల మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మోహన్‌కు మంత్రి గురువారం అభినందనలు తెలిపారు.

కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కారానికి మా సిరిసిల్ల బిడ్డ డాక్టర్ పత్తిపాక మోహన్ ఎంపికవడం చాలా సంతోషంగా ఉందని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. గాంధీజీపై ఆయన రాసిన 'బాలల తాతా బాపూజీ' గేయ కథకు ఈ పురస్కారం దక్కడం హర్షనీయమన్నారు.

## పెన్ డ్రైవ్ తో ఏం చేసుకోవాలి-ఏజీని ప్రశ్నించిన హైకోర్టు న్యాయమూర్తి

హైదరాబాద్, ఆగష్టు 25: తన పాదయాత్రలో బిజెపి తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్ చేస్తున్నారని ఆరోపించిన ఏజీ.. రెచ్చగొట్టే ప్రసంగాలు బండి సంజయ్ ప్రసంగాలకు చెందిన వీడియోలను పెన్ డ్రైవ్‌లో కోర్టుకు అందజేశారు. ఏజీ అందజేసిన పెన్ డ్రైవ్‌ను తదేకంగా పరిశీలించిన హైకోర్టు న్యాయమూర్తి?పెన్ డ్రైవ్‌తో ఏం చేసుకోవాలని ఏజీని ప్రశ్నించారు. కోర్టుకు సమర్పించే ఆధారాలు ఏ రూపంలో ఉండాలో మీకు తెలియదా? అంటూ ఏజీని నిలదీసిన న్యాయమూర్తి? డాక్యుమెంట్ల సమర్పణలోనూ నిబంధనలు పాటించకుంటే ఎలాగని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీడియోలను సమర్పించాల్సి రావడంతోనే పెన్ డ్రైవ్‌లో ఇవ్వాల్సి వచ్చిందన్న ఏజీ? సాఫ్ట్ కాపీల్లో ఆ వీడియోలను అందజేస్తామని చెప్పడంతో న్యాయమూర్తి శాంతించారు. బండి సంజయ్ పాదయాత్ర నిలుపుదల, పునరుద్ధరణ కోసం బీజేపీ దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు గురువారం విచారణ చేపట్టింది. ఈ విచారణ సందర్భంగా ఈ ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. కోర్టు విచారణకు పాదయాత్రను నిలుపుదల చేసిన వర్ధన్నపేట ఏసీపీతో పాటు తెలంగాణ పోలీసు శాఖ తరఫున వాదనలు వినిపించేందుకు అడ్వొకేట్ (ఏజీ) జనరల్ బీఎస్ ప్రసాద్ హాజరయ్యారు.

## జర్నలిస్టులకు ఇచ్చిన హామీని నెరవేరుస్తాం.. కేటీఆర్ ట్వీట్

హైదరాబాద్, ఆగష్టు 25: జర్నలిస్టుల ఇండ్ల సమస్యను పరిష్కరించిన భారత అత్యున్నత న్యాయస్థానం చీఫ్ జస్టిస్‌కు రాష్ట్ర మంత్రి కేటీఆర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసును క్లియర్ చేసినందుకు సీజేఐకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు కేటీఆర్ ట్వీట్ చేశారు. జర్నలిస్టులకు ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు ఈ తీర్పు తోడ్పడుతుందని కేటీఆర్ పేర్కొన్నారు.

సుదీర్ఘ కాలంగా ఇండ్ల స్థలాల కోసం పోరాడుతున్న హైదరాబాద్‌లోని జర్నలిస్టులకు సీజేఐ శుభవార్త వినిపించిన సంగతి తెలిసిందే. జర్నలిస్టులకు కేటాయించిన స్థలాల స్వాధీనానికి, నిర్మాణాలకు అనుమతిస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం తీర్పునిచ్చింది.

## 27, 28 తేదీల్లో తెలంగాణలో భారీ వర్షాలు

హైదరాబాద్, ఆగష్టు 25: రాష్ట్రంలో ఈనెల 29వ తేదీ వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అయితే ఈనెల 27, 28 తేదీల్లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రాథమిక హెచ్చరిక జారీ చేసింది.వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం దక్షిణ జార్ఖండ్ పరిసర ప్రాంతాల్లో కొనసాగుతూ సగటు సముద్ర మట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తున విస్తరించిన ఉన్నట్లు పేర్కొన్నది. అలాగే మరో ఆవర్తనం దక్షిణ అంతర్గత తమిళనాడు పరిసర ప్రాంతాల్లో సగటు సముద్ర మట్టానికి 5.8కిలో మీటర్ల వరకు విస్తరించిందని తెలిపింది. రాష్ట్రంలో పశ్చిమ, వాయువ్య దిశల నుంచి కింది స్థాయి గాలులు వీస్తున్నాయని పేర్కొన్నది. దీని ప్రభావంతో ఈనెల 29 వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కాగా గడిచిన 24 గంటల్లో వికారాబాద్ జిల్లాలో పలు చోట్ల భారీ వర్షం కురిసినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొన్నది.

### చరిత్రలో నేటినిజం



కం॥ కలలుగ కనబడు కథలకు
కలమును గాని రూపము నిడి కావ్యము ప్రాయన్
"బలభద్రపాత్రుని రమణి"
కలభాషిణిగా జెలంగి ఖ్యాతిగడించెన్!!

(ఆగష్టు 26 రచయిత్రి బలభద్రపాత్రుని రమణి జననం..)

–రాధశ్రీ
సెల్:9494481210



## రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌ను ప్రారంభించిన సీఎం కేసీఆర్



హైదరాబాద్, ఆగష్టు 25: ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలోని కొంగరకలాన్‌లో నిర్మించిన రంగారెడ్డి జిల్లా సమీకృత కలెక్టరేట్ సముదాయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం ప్రారంభించారు. కొంగరకలాన్‌లోని సర్వే నంబర్ 300లో 44 ఎకరాల్లో రూ. 58 కోట్ల వ్యయంతో మూడు అంతస్తుల్లో, వందకు పైగా విశాలమైన గదులతో కలెక్టరేట్ సముదాయాన్ని నిర్మించారు. కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా సర్వమత ప్రార్థనలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, కలెక్టర్ అమయ్ కుమార్, మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ప్రశాంత్ రెడ్డి, ఎంపీ రంజిత్ రెడ్డితో పాటు మహేశ్వరం, కల్వకుర్తి, షాద్‌నగర్, రాజేంద్రనగర్, చేవెళ్ల, ఎల్బీనగర్ నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు రాష్ట్రాన్ని ఆగం కానివ్వను : సీఎం కేసీఆర్



రంగారెడ్డి, ఆగష్టు 25:నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు తెలంగాణ రాష్ట్రాన్ని ఆగం కానివ్వను. ఈ రాష్ట్రాన్ని కాపాడేందుకు సర్వశక్తులను ధారపోస్తాను. నా బలగం ప్రజలే. మీ అండదండలు, ఆశీర్వచనం ఉన్నంత వరకు తనకేం కాదని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌ను ప్రారంభించిన అనంతరం కేసీఆర్ ప్రసంగించారు.

ఒక ఇల్లు కట్టాలంటే చాలా సమయం ఏర్పడుతుంది. రాష్ట్రం ఏర్పడాలంటే చాలా సంవత్సరాలు పడుతుంది. ప్రాజెక్టు కట్టాలంటే చాలా సమయం పడుతుంది. మూఢనమ్మకాలు, పిచ్చితో, ఉన్మాదంతో వాటన్నింటిని రెండు మూడు రోజుల్లో కూలగొట్టొచ్చు. ఎంత కష్టమైతది. శిథిలమైపోతది. 58 ఏండ్లు తెలంగాణ కోసం కొట్లాడం. తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. బెంగళూరు సిటీ సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా పేరొందింది. అక్కడి ప్రభుత్వాలు చాలా కష్టపడి ఒక వాతావరణాన్ని నిర్మాణం చేశారు. 30 లక్షల మందికి ఐటీలో ప్రత్యక్షంగా ఉద్యోగాలు దొరకుతున్నాయి. ఈ సంవత్సరం మన కంటే తక్కువ ఉద్యోగాల కల్పన జరిగింది. తెలంగాణ ఒక లక్షా 55 వేల ఉద్యోగాలు ఇచ్చింది. కానీ బెంగళూరులో ఈ ఏడాది ఏడెనిమిది వేల ఉద్యోగాలు తగ్గిపోయాయి. అక్కడ వాతావరణాన్ని కలుషితం చేశారు. అలాంటి వాతావరణం తెలంగాణలో, హైదరాబాద్‌లో రావాలా? మన పిల్లలకు ఉద్యోగాలు రాకుండా పోవాలా? ఆలోచించాల్సిన అవసరం ఉందని కేసీఆర్ ప్రశ్నించారు.

### రంగారెడ్డి జిల్లా తెలంగాణకే బంగారు కొండ

ఇవాళ రంగారెడ్డి జిల్లా తెలంగాణకే బంగారు కొండగా మారిందని కేసీఆర్ పేర్కొన్నారు. ఎకరం భూమి ఉన్న వ్యక్తి కూడా పెద్ద కోటీశ్వరుడు. ఈ మత పిచ్చిల పడి దాన్ని చెడగొట్టుకోవాలా. నీచ రాజకీయాల కోసం రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేస్తుంటే చూసి ఊరుకోవద్దు. ఓట్ల కోసం భారత సొసైటీని గోస పెట్టే పరిస్థితి తెస్తున్నారు. మోదీ ఆగంఆగం అవుతున్నారు. ఉన్న పదవి చాలాదా? అంతకన్న పెద్ద పదవి లేదు కదా..? మన తెలంగాణలో ఎలాంటి కారుకూతలు కూస్తున్నారో ఆలోచించాలి. తెలంగాణ సమాజాం ప్రశాంతంగా ఉంది. అద్భుతమైనటువంటి ప్రశాంత వాతావరణంలో అభివృద్ధి జరుగుతుంది. ఈ దుర్మార్గులు, చిల్లరగాళ్లు, మత పిచ్చిగాళ్ల మాయలో పడొద్దని కేసీఆర్ సూచించారు.

## సుస్తీలు పోగొట్టేందుకే.. బస్తీ దవాఖానలు : హరీశ్‌రావు




హైదరాబాద్, ఆగష్టు 25: బస్తీల సుస్తీ పోగొట్టాలనే ఉద్దేశంతోనే సీఎం కేసీఆర్ బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేస్తున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. రాజేంద్రనగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ నూతన అకాడమిక్ భవన సముదాయానికి గురువారం ప్రారంభోత్సవం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లాంటి నగరంలో ఐఐపీహెచ్ సంస్థ ఉండడం మంచి విషయమన్నారు. 2015లో సీఎం కేసీఆర్ 45 ఎకరాల భూమి ఐఐపీహెచ్‌కు ఇచ్చారని, అలాగే ప్రజారోగ్యంపై దృష్టి పెట్టి రూ.10కోట్ల ఆర్థిక సాయం ప్రకటించారన్నారు. ఇటీవల ప్రజలు, ప్రభుత్వాలు ప్రజారోగ్య ప్రాముఖ్యతను అర్థం చేసుకున్నాయని, ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో అవసరమైన వసతులు సమకూర్చుకుంటున్నాయన్నారు.

తెలంగాణ ప్రభుత్వం ఎనిమిదేళ్ల కృషికి మంచి ఫలితాలు వచ్చాయని, ప్రభుత్వం అమలు చేస్తున్న పల్లె, పట్టణ ప్రగతితో మలేరియా, డెంగ్యూ జ్వరాలు తగ్గాయన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఆరోగ్య సూచికల్లో గణనీయమైన పురోభివృద్ధి సాధించామన్న మంత్రి హరీశ్.. ఇటీవల రాజ్యసభలో కేంద్ర ప్రభుత్వం వైద్యరంగంలో తెలంగాణ చేస్తున్న కృషిని ప్రశంసించిందని గుర్తు చేశారు. వైద్యసేవల మీద ఎక్కువ ఖర్చు చేస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ మూడో స్థానంలో నిలిచిందన్నారు. నగరాలు, పట్టణాల్లో స్లమ్ ఏరియాలు ఎక్కువగా ఉంటాయని, దీంతో సీఎం కేసీఆర్ బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. వీటి ద్వారా పేదలకు వైద్యం అందించే ప్రయత్నాల్లో ఉన్నామన్నారు.

జీహెచ్‌ఎంసీ పరిధిలో ఇప్పటికే 259 బస్తీ దవాఖానాల ద్వారా వైద్యం అందుతోందని, బస్తీ దవాఖాన పథకం బాగా ఉందని 15వ ఆర్థిక సంఘం ప్రశంసించిందన్నారు. తెలంగాణలో ప్రజా ఆరోగ్యం బలోపేతానికి 630 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పబ్లిక్ మేనేజ్‌మెంట్ పర్సన్ నియమించి.. మరింత మెరుగైన సేవలను అందించేందుకు కృషి చేస్తామన్నారు. అంతేకాకుండా ప్రతి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఐటీ వింగ్ సైతం ఏర్పాటు చేయబోతున్నామని, తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలో నెంబర్ వన్ రాష్ట్రంగా నిలుపేందుకు అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటాయించుకున్నామన్నారు. రూ.6,295 కోట్ల నుంచి రూ.11,440 కోట్లకు పెంచుకున్నామన్నారు. తెలంగాణ వార్షిక బడ్జెట్లో 4.5 శాతం ఆరోగ్య రంగంపై వెచ్చిస్తున్నామన్నారు.

ప్రస్తుతం కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం ఈ సంవత్సరం కేవలం 1.1 శాతం మాత్రమే కేటాయించిందని, దేశంలోనే ఎక్కడా లేనివిధంగా జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ కడుతున్నామని, దానికి అనుబంధంగా నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మరో ఆరు సూపర్ స్పెషలిటీ ఆసుపత్రులు నిర్మిస్తున్నామని, సూపర్ స్పెషాలిటీ వైద్యంతో పాటు, వైద్య విద్యను విస్తృతం చేసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో అన్ని రంగాల్లో మనం ముందున్నామని, వైద్య ఆరోగ్య రంగంలో కూడా తెలంగాణ దేశానికి దిక్సూచి కావాలన్నది సీఎం కేసీఆర్ ఆకాంక్ష అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌శర్మ, ఐఐపీహెచ్ ప్రెసిడెంట్ శ్రీనాథ్‌రెడ్డి, బోర్డ్ డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.

## ముగ్గురు చొరబాటుదారులను కాల్చి చంపిన జవాన్లు

హైదరాబాద్, ఆగష్టు 25: ముగ్గురు చొరబాటుదారులను జవాన్లు కాల్చి చంపారు. పాకిస్థాన్ భూభాగం నుంచి జమ్మూ కశ్మీర్ లోకి చొరబడాలన్న ఉగ్రవాదుల పన్నాగాన్ని భారత భద్రతా బలగాలు వమ్ముచేశాయి. యూరీ సెక్టార్లోని కమాల్ కోటే వద్ద ముగ్గురు చొరబాటుదారులను జవాన్లు కాల్చి చంపారు. సరిహద్దు నియంత్రణ రేఖ (ఎల్ఓసీ)కి సమీపంలో మదియాన్ నానక్ పోస్టు వద్ద ఉగ్రవాదుల కదలికలను గుర్తించిన భారత సైన్యం, కశ్మీర్ పోలీసులు సంయుక్త ఆపరేషన్ చేపట్టారు. భారత బలగాలు, ఉగ్రవాదుల మధ్య భారీగా కాల్పులు జరిగాయి. ముగ్గురు ఉగ్రవాదులు మరణించడంతో చొరబాటు యత్నం భగ్నమైంది. దీనికి సంబంధించిన వివరాలను కశ్మీర్ పోలీసులు వెల్లడించారు. ఇటీవల కాలంలో కశ్మీర్ సరిహద్దుల వ్యాప్తంగా చొరబాట్లు పెరిగాయి. 2018 నుంచి 2021 వరకు 366 చొరబాటు యత్నాలు జరిగినట్టు కేంద్ర ప్రభుత్వం గత మార్చిలో పార్లమెంటుకు తెలిపింది. 2004లో కేంద్రం 740 కిలోమీటర్ల పొడవైన ఎల్ఓసీ వద్ద 550 కిలోమీటర్ల మేర కంచెను నిర్మించింది. అయినా చొరబాటు దారుల ఆగడాలు తగ్గట్లేదు.

## గ్రామ కంఠం భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం : మంత్రి ఎర్రబెల్లి



హైదరాబాద్, ఆగష్టు 25: రాష్ట్రంలో గల అన్ని గ్రామాల్లోని గ్రామ కంఠం భూములకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తున్నది. గ్రామ కంఠంలోని భూ యజమానుల భూములు గుర్తించి, వాటికి చట్టబద్ధత కల్పించి, క్రయ విక్రయాలకు కూడా వీలు కలిగే విధంగా రికార్డులు కల్పించడమే లక్ష్యంగా సీఎం సమీక్షలు నిర్వహిస్తున్నారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు.

రాజేంద్ర నగర్ ఆ ఎఖీఆలో ఈ విషయమై డీపీఓలు, ఎంపీడీవోలు ఇతర అధికారులు, సర్పంచ్‌లతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని అమలు చేస్తున్నాం. పల్లె ప్రగతి వంటి పథకంతో గ్రామాల రూపు రేఖలు మార్చుకున్నాం.

ధరణి వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో భూ సమస్యలకు పరిష్కారం చూపెట్టాం. ఇదే తరహాలో గ్రామ కంఠం భూముల సమస్యలను పరిష్కరించేందుకు సీఎం కేసీఆర్ ఆలోచన చేస్తున్నారన్నారు.

ఇందులో భాగంగా గ్రామ కంఠం భూములకు చట్టబద్ధత కల్పించే విధంగా చేస్తూనే, భూములను స్థిరీకరించి, గుర్తించి, వాటి క్రయ విక్రయాలకు వీలు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

ప్రస్తుతం రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా మెదక్ జిల్లాలోని కొత్తపల్లి మల్లంపేట, మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్నారెడ్డిపల్లి, నంచెర్ల గ్రామ పంచాయతీల్లో పైలెట్ ప్రాజెక్టు చేపట్టామన్నారు.

అలాగే స్వామిత్వ పథకం కింద, రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం సరస్వతి గూడ, మేడ్చల్ జిల్లా కీసర మండలం గోధుమ కుంట, జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం, ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం అర్లి గ్రామం, కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం దోమకొండ గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద డ్రోన్ ల ద్వారా సర్వే ఆఫ్ ఇండియా సహకారంతో గ్రామ కంఠాలకు సంబంధించి కొత్త మ్యాప్ లను సిద్ధం చేస్తున్నామని మంత్రి వివరించారు.

ఈ లోగా అధికారులు గ్రామ స్థాయిలో ఎదురువుతున్న సమస్యలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని మంత్రి ఆదేశించారు.

## హుస్సాముద్దీన్ సన్మానించిన మంత్రి వేముల, ఎమ్మెల్సీ కవిత



నిజామాబాద్, ఆగష్టు 25: ఇటీవల జరిగిన కామన్ వెల్త్ క్రీడల్లో నిజామాబాద్‌కు చెందిన సుబేదార్‌హుస్సాముద్దీన్ పురుషుల బాక్సింగ్ 57 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించిన విషయం తెలిసిందే. కాగా, గురువారం మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ కవిత హుస్సాముద్దీన్ ను ఘనంగా సన్మానించారు.

భవిష్యత్ లో మరిన్ని పథకాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాజేశ్వర్ రావు, సాట్స్ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర రెడ్డి,పలువురు ప్రజాప్రతినిధులు ఉన్నారు.




# ప్రేమను పంచిన విశ్వ సేవకురాలు మదర్ థెరిసా

**(26 ఆగష్టు 'మదర్ థెరిసా జన్మదినం' సందర్భంగా)**

అల్బేనియన్ సంతతికి చెందిన మదర్ థెరిసా (అసలు పేరు ఆగ్నెస్ గోగ్జా బొజాక్షియ్) మసిడోనియాలో 26 ఆగష్టు 1910న జన్మించి, మరుసటి రోజున బాప్టిజమ్ పొందారు. 'దేవుడి బలమైన పిలుపు'ను 12 ఏటనే గమనించిన థెరిసా, మిషనరీ ఆశ్రమాన్ని గొడుగుగా చేసుకొని సేవలను చేస్తూనే ప్రేమను పంచడాన్ని జీవిత లక్ష్యంగా ఎంచుకున్నారు. తన 18వ ఏటనే ఐరిష్‌కు చెందిన 'సిస్టర్స్ ఆఫ్ లొరెటో'లో చేరిన తరువాత కొన్ని మాసాలు 'నన్ (సన్యాసిని)'గా శిక్షణ పొందారు. అనంతరం 24 మే 1931న ఇండియాలోని కలకత్తాకు చేరి, 1931 – 48 మధ్య కాలంలో కలకత్తాలోని సేయింట్ మేరీ ఉన్నత పాఠశాలలో బోధనలు చేశారు. 24 మే 1937న లొరెటో నన్‌లకు లభించే అరుదైన 'మదర్' టైటిల్‌ను పొంది 'మదర్ థెరిసా'గా పిలువబడ్డారు. 10 సెప్టెంబర్ 1946న 'అంతరాత్మ పిలుపు (కాల్ విత్ఇన్ కాల్)' మేరకు తన జీవితాన్ని సేవల వైపుకు మార్చుకోవడం మె?దలు పెట్టారు. కాన్వెంట్ బయట సంచరిస్తున్న పేదలను చూసి చలించిన థెరిసా తమ మిషనరీ పెద్దల నుంచి అనుమతి తీసుకొని నిరుపేదల సేవకు అంకితం అయ్యారు. ఎలాంటి ఆర్థిక సహాయం లేకుండానే మురికివాడల పిల్లలకు 'ఓపెన్ ఎయిర్ స్కూల్' ప్రారంభించారు. తన నిస్వార్థ సేవాగుణాన్ని గమనించిన కొందరు అభిమానులు ఆర్థిక 07 అక్టోబర్ 1950న 'ది మిషనరీస్ ఆఫ్ చారిటీ' కేంద్రాన్ని నెలకొల్పిన థెరిసా అనాధ బాలల ఉద్ధరణకు నడుం బిగించారు. 1965 నాటికి తన సేవాసంస్థ 'పోప్ పాల్–6' గుర్తింపుతో అంతర్జాతీయ సంస్థగా నిలుపగలిగారు. నాటి నుండి పలు దేశాల మిషనరీ సిస్టర్స్, బ్రదర్స్ సహకారంతో వివిధ దేశాల అభాగ్య అనాధలకు ప్రేమానురాగాలను పంచడం, 1984లో 'ప్రీస్ట్ శాఖ'ను స్థాపించడంతో అంతర్జాతీయ దృష్టిని ఆకర్శించారు. థెరిసా నిర్మించిన 'సొసైటీ ఆఫ్ మిషనరీస్' ద్వారా యురొప్, రష్యా లాంటి దేశాలతో పాటు అనేక ప్రపంచ దేశాల్లో సేవలను విస్తరించారు. అనాధ నిరుపేదల సేవలతో పాటుగా ప్రకృతి వైపరీత్యాలు (వరదలు, మహమ్మారులు, కరువుకాటకాలు, శరనార్థులు) సంభవించినపుడు మానవీతను తట్టిలేపుతూ అద్వితీయ సేవలు అందించారు. వ్యసనపరులు, మద్యం బానిసలు, గృహాలు లేని వారు, ఏయిడ్స్, టిబి, క్షయ రోగులు లాంటి వర్గాలను చేరదీసి వ్యక్తిగతంగా సేవలు అందించారు.

మదర్ థెరిసా సేవా విస్తృతిని గమనించిన అంతర్జాతీయ సమాజం నోబెల్ శాంతి బహుమతి (1979), పోప్ జాన్ శాంతి బహుమతి (1971), నెహ్రూ శాంతి బహుమతి (1969), పద్మశ్రీ (1962), బల్జన్ బహుమతి (1979), మెగసెసి ఆవార్డు (1962), టెంప్లేట్ ఆవార్డు (1962) లాంటివి అనేక అంతర్జాతీయ గుర్తింపులతో సన్మానించడం సర్వసాధారణం అయ్యింది. 20వ శతాబ్దపు ప్రపంచ అత్యుత్తమ మానవతామూర్తిగా మదర్ థెరిసా అసమాన్య సేవాసామ్రాజ్యానికి మహాసేవకురాలిగా కాలం ఉన్నంత వరకు మన మనో ఫలకాల్లో నిలిచే ఉంటారు. కాథలిక్ చర్చ్ మిషనరీ మదర్ థెరిసా పేదల, రోగుల పక్షపాతిగా 'సేయింట్ థెరిసా ఆఫ్ కలకత్తా'గా 4,000లకు పైగా చారిటీ మిషనరీల ద్వారా వేల మంది స్వచ్ఛంధ సేవకులతో 133 దేశాల్లో 610 ఫౌండేషన్లతో సేనలకు విస్తృత పరిచారు. 05 సెప్టెంబర్ 1997న తన 87వ ఏట తుది శ్వాస విడిచిన 'సేయింట్ థెరిసా ఆఫ్ కలకత్తా' విశ్వ సేవకురాలిగా, మానవీయతను పంచిన మహిళగా, ప్రేమను వితరణ చేసిన అమ్మగా, మచ్చలేని శ్వేతవర్ణ శాంతి కపోతంగా మనందరి హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకోగలిగారు.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# అవార్డ్ అందుకున్న కుమ్మరి రాంమూర్తి ,యాసారపు భాస్కర్




హైదరాబాద్, ఆగష్టు 25: హైదరాబాద్ బాబు జగ్జీవన్ రామ్ ఆడిటోరియంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో పేద బడుగు బలహీన వర్గాలకు సామాజిక సేవ చేస్తున్నందుకుగాను తెలంగాణ హైకోర్టు సీనియర్ అడ్వకేట్ మిట్టకోల వెంకట రామారావు, సీనియర్ అడ్వకేట్ బట్టు శ్రీనివాస్, నేషనల్ హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షులు మంగళంపల్లి హుస్సేన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న పెద్దవంగర మండల హ్యూమన్ రైట్స్ చైర్మన్ కుమ్మరి రాంమ్మూర్తి తో పాటు తొర్రూర్ డివిజన్ జనరల్ సెక్రెటరీ యాసారపు భాస్కర్. వారు మాట్లాడుతూ ఈ అవార్డ్ రావటం చాలా సంతోషకరం దీనితో పాటు మా బాధ్యత ఇంకా పెరిగింది అని అన్నారు. మా అవార్డ్ కు సహకరించినా పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

# శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ ఎనిమిది అగ్రశ్రేణి ఆస్ట్రేలియన్ యూనివర్శిటీలతో చర్చాగోష్టి లో పాల్గొన్నారు

న్యూఢిల్లీ,ఆగష్టు 25: కేంద్ర విద్య మరియు నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ ఈరోజు విజయవంతమైన ఆస్ట్రేలియా–భారత పరిశోధన భాగస్వామ్యం పై ఎనిమిది అగ్రశ్రేణి (ఉ08) ఆస్ట్రేలియన్ విశ్వవిద్యాలయాల బృందంలోని విద్యావేత్తలతో చర్చలు జరిపారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ తన 76వ స్వాతంత్ర్య దినోత్సవ ఉపన్యాసాన్ని ప్రస్తావిస్తూ జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్ నినాదానికి అదనంగా జోడించిన జై అనుసంధాన్ మంత్రాన్ని పునరుద్ఘాటించారు. రాబోయే దశాబ్దంలో ఆతరువాత భారతదేశం యొక్క ఆర్థిక వృద్ధికి పునాదిని ఈ విశిష్ట అంశం కల్పిస్తుంది. ఈ దశాబ్దాన్ని భారతదేశం యొక్క సాంకేతిక దశాబ్ది గా అభివర్ణిస్తూ దేశ స్వావలంబనకోసం తన వనరులోని ప్రతి ఒక్కటినీ ను ప్రోది చేయాలనే భారతదేశ సంకల్పాన్ని మంత్రి పంచుకున్నారు. భారత్‌తో పరిశోధన భాగస్వామ్యం బలోపేతం చేసుకోవడం అందరికీ విజయమని ఆయన అన్నారు. భారతదేశం ఆస్ట్రేలియా మధ్య మంచి పరిశోధనా భాగస్వామ్యం ఉందని శ్రీ ప్రధాన్ అన్నారు. జాతీయ ప్రాధాన్యతలను నెరవేర్చడానికి మరియు ప్రపంచ సవాళ్లకు పరిగణించగల పరిష్కారాలను అందించడానికి కొత్త అవకాశాలను స్వీకరించడానికి మన పరస్పర పరిశోధన సహకారాలను మరింత తీవ్రతరం చేయడం కోసం ఎనిమిది విశ్వవిద్యాలయాల బృందాన్ని ఆయన స్వాగతించారు. 'విద్య, పరిశోధన మరియు నైపుణ్య రంగాలలో సహకారానికి నూతన అవకాశాలు' అనే అంశంపై జరిగిన సమావేశం లో మోనాష్ విశ్వవిద్యాలయంలోని ఆస్ట్రేలియా ప్రభుత్వ విద్యావేత్తలు మరియు ఆస్ట్రేలియా ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులతో కూడా మంత్రి సంభాషించారు. నిర్ధారిత ఆధారిత పరిశోధనలపై ప్రధాని నొక్కిచెప్పారని, మానవాళి పురోగతి, సంక్షేమం మరియు శ్రేయస్సు కోసం పరిశోధనశాల నుంచి క్షేత్ర స్థాయి కి 'ల్యాబ్–టు–ల్యాండ్' మరియు క్షేత్ర స్థాయి నుంచి పరిశోధనశాలకు 'ల్యాండ్–టు–ల్యాబ్' అనే మంత్రాన్ని అందించారని మంత్రి తెలిపారు. భారతదేశం అన్ని స్థాయిలలో ఉత్సుకత సృనాత్మకత ప్రేరణ తో పరిశోధన మరియు ఆవిష్కరణలను పెంపొందించడానికి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తోందని ఆయన అన్నారు.

**అక్షర సేద్యం ఫౌండేషన్**
**సుగుణ సాహితి సమితి సిద్ధిపేట**

**కథ రాయండి – కథల పుస్తకం గెల్చుకోండి !**

75వ స్వాతంత్ర్య వజ్రోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన పాఠశాలల విద్యార్థుల నుండి 'కథల పోటీ'కి కథలను ఆహ్వానిస్తున్నాము.

75 ఉత్తమ కథలు ఎంపిక
ప్రతి కథకు "రామసక్కని గాలిపటం"
పుస్తకం బహుకరణ



నియమ నిబంధనలు :
* విద్యార్థులు తమకు నచ్చిన అంశంపై కథలు వ్రాయవచ్చు.
* కథల నిడివి చేతివ్రాతలో 2 లేదా 3 పేజీలు మించరాదు.
* పోటీకి పంపించే కథలు ఇదివరలో ఏ పత్రికలోనూ ప్రచురణ కానివి, వాట్సప్ / బ్లాగులలో పరిశీలనలో లేనివి, కథ తమ స్వంతమేనని హామీ పత్రం తప్పనిసరిగా జతపరచాలి. హామీ పత్రంపై ప్రధానోపాధ్యాయులు/ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయులు లేదా తల్లిదండ్రుల సంతకం ఉండవలెను.
* కథలు ఎంపికలో న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయం. ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు.
* కథలను స్వయంగా కాని, పోస్ట్ ద్వారా, వాట్సప్ ద్వారా గాని పంపవచ్చును. వాట్సప్ ద్వారా పంపేవారు టైప్‌చేసి పంపగలరు లేదా అందమైన చేతివ్రాతతో పేపర్‌పై వ్రాసి స్కాన్ చేసి కూడా పంపవచ్చు.
* కథలు పంపాల్సిన చివరి తేది. 10 సెప్టెంబర్ 2022.

కథలు పంపాల్సిన చిరునామా : ప్రధాన కార్యదర్శి, అక్షర సేద్యం ఫౌండేషన్
గ్రా॥ రామునిపట్ల, జి॥ సిద్ధిపేట - 502 267. వాట్సప్ : 9701933704

అధ్యక్షులు : డా॥ మొసర్ల మాధవరెడ్డి, సుగుణ సాహితి సమితి
అధ్యక్షులు : భైతి దుర్గయ్య, అక్షరసేద్యం ఫౌండేషన్
ప్రధానకార్యదర్శి : వేల్పుల రాజు, అక్షరసేద్యం ఫౌండేషన్

# సాహిబ్ జాదా అజీత్ సింహ్ నగర్ (మొహాలీ) లో 'హోమీ భాభా కేన్సర్ హాస్పిటల్ ఎండ్ రిసర్చ్ సెంటర్' ను దేశ ప్రజల కు అంకితం చేసిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ,ఆగష్టు 25: సాహిబ్ జాదా అజీత్ సింహ్ నగర్, మొహాలీ లో 'హోమీ భాభా కేన్సర్ హాస్పిటల్ ఎండ్ రిసర్చ్ సెంటర్' ను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న దేశ ప్రజల కు అంకితం చేశారు. ఈ కార్యక్రమాని కి హాజరైన వారిలో పంజాబ్ గవర్నర్ శ్రీ బన్ వారీలాల్ పురోహిత్, పంజాబ్ ముఖ్యమంత్రి శ్రీ భగవంత్ మాన్, కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింహ్ తదితరులు ఉన్నారు.

ఈ సందర్భం లో ప్రధాన మంత్రి మాట్లాడుతూ, ఈనాటి కార్యక్రమం దేశం లో మెరుగైన ఆరోగ్య సంరక్షణ సదుపాయాల కు అద్దం పడుతోంది అన్నారు. ఈ ఆసుపత్రి పంజాబ్, హరియాణా, ఇంకా హిమాచల్ ప్రదేశ్ ప్రజల కు సేవల ను అందిస్తుంది అని ఆయన చెప్పారు. హర్ ఘర్ తిరంగా అభియాన్ లో పంజాబ్ ప్రజలు ఉత్సాహం గా పాలుపంచుకొన్నందుకు గాను వారికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

భారతదేశాన్ని అభివృద్ధి చెందినటువంటి ఒక దేశం గా తీర్చిదిద్దే విషయం లో ఎర్రకోట బురుజుల నుంచి తాను చేసిన ప్రకటన ను గురించి ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, "భారతదేశాన్ని అభివృద్ధి చేయాలి అంటే దేశం లోని ఆరోగ్య సేవల ను అభివృద్ధి పరచడం సైతం అంతే ప్రధానమైన విషయం అవుతుంది'' అని పేర్కొన్నారు. భారతదేశ ప్రజలు చికిత్స కోసం ఆధునిక సదుపాయాలు కలిగిన నూతన ఆసుపత్రుల కు నోచుకొన్నప్పుడు వారు త్వరగా స్వస్థులై, మరి వారి శక్తి సరి అయిన దిశ లో ప్రవహిస్తుంది అని ప్రధాన మంత్రి అన్నారు. కేన్సర్ చికిత్స కోసం తగిన సదుపాయాల ను ఏర్పరచాలి అన్నదే ప్రభుత్వం యొక్క నిబద్ధత అని ప్రధాన మంత్రి పునరుద్ఘాటించారు. టాటా మెమోరియల్ సెంటర్ లో ప్రతి సంవత్సరం ఒకటిన్నర లక్షల మంది రోగుల కు చికిత్స ను అందించే సదుపాయాలు ప్రస్తుతం సమకూరాయి అని ఆయన వెల్లడించారు. బిలాస్ పుర్ లో కొత్త ఆసుపత్రి, ఇంకా ఎఐఐఎమ్ఎస్ లు, పిజిఐ చండీగఢ్ మీద పడుతున్న భారాన్ని తగ్గించడం తో పాటు రోగుల కు, రోగుల కుటుంబాల కు బోలెడంత ఉపశమనాన్ని అందిస్తాయి అని ఆయన అన్నారు.

ఒక మంచి ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ అంటే, నాలుగు గోడల ను నిర్మించడం ఒక్కటే దాని అర్థం కాదు అని ప్రధాన మంత్రి వ్యాఖ్యానించారు. ఏ దేశం లోని ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ అయినా సరే ప్రతి ఒక్క మార్గం లో, మరి దశల వారీగా పరిష్కారాల ను ఇనస్తూ, సమర్థన ను అందించినపుడు మాత్రమే ఆ దేశం లోని ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ అనేది బలపడుతుంది అని ఆయన స్పష్టం చేశారు. సమగ్రమైనటువంటి ఆరోగ్య సంరక్షణ సేవల కు గడచిన ఎనిమిది సంవత్సరాల లో దేశం లో అగ్ర ప్రాధాన్యాన్ని కట్టబెట్టడం జరిగింది అని కూడా ప్రధాన మంత్రి వివరించారు.

ప్రస్తుతం దేశం లో ఆరోగ్య రంగ సదుపాయాల ను మెరుగు పరచడం కోసం ఆరు విధాలుగా కృషి చేయడం జరుగుతున్నది అని ప్రధాన మంత్రి వెల్లడించారు. ఆ ఆరు విధాల ను ఆయన వివరిస్తూ, వాటి లో ఒకటోది– నివారణ ప్రధానమైన ఆరోగ్య సంరక్షణ ను ప్రోత్సహించడం; రెండోది – పల్లె ప్రాంతాల లో చిన్నవి మరియు ఆధునికమైనవి అయినటువంటి ఆసుపత్రుల ను ఏర్పాటు చేయడం; మూడవది – నగర ప్రాంతాల లో వైద్య కళాశాల లను, అలాగే పెద్ద వైద్య పరిశోధన సంస్థల ను తెరవడం; నాలుగోది – దేశవ్యాప్తం గా వైద్యుల సంఖ్య ను, అలాగే, పారా మెడికల్ స్టాఫ్ సంఖ్య ను పెంచడం; ఇక అయిదోది – మందుల ను, వైద్య సామగ్రిని చౌక లో రోగుల కు అందజేయడం కాగా; ఆరోది – సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం ద్వారా రోగుల ఇక్కట్టులను తగ్గించడం అని ప్రధాన మంత్రి పేర్కొన్నారు.

నివారణ పద్ధతి ని గురించి ప్రధాన మంత్రి చెప్తూ, జల్ జీవన్ అభియాన్ వల్ల నీటి ద్వారా సంక్రమించే వ్యాధుల బారిన పడుతున్న రోగుల సంఖ్య చెప్పుకోదగినంత స్థాయి లో తగ్గుముఖం పట్టింది అని పేర్కొన్నారు. అదే విధం గా, స్వచ్ఛత, యోగ, ఫిట్ నెస్ ధోరణులు, పోషణ్ అభియాన్, వంట గ్యాస్.. మొదలైనవి రోగుల సంఖ్య ను తగ్గిస్తున్నాయి అని ఆయన అన్నారు. మరోవైపు చూస్తే, నాణ్యమైనటువంటి పరీక్ష కేంద్రాలు ఏర్పరచడం ద్వారా, మరి అలాగే ఒకటిన్నర లక్షల కు పైగా హెల్త్ ఎండ్ వెల్ నెస్ సెంటర్ లను ఏర్పాటు చేయడం జరుగుతోంది. వాటిలో ఇప్పటికే 1.25 లక్షల కేంద్రాల ను నెలకొల్పడమైంది. పంజాబ్ లో దాదాపు గా 3000 కేంద్రాలు కార్యకలాపాల ను నిర్వహిస్తున్నాయి. దేశం మొత్తం మీద చూసుకొంటే 22 కోట్ల కు పైచిలుకు ప్రజల ను వారు కేన్సర్ బారిన పడ్డారా అనేది నిర్ధారించడం కోసం పరీక్షల ను జరపగా, వారిలో 60 లక్షల మంది కి ఒక్క పంజాబ్ లోనే పరీక్షలు నిర్వహించడమైంది అని ప్రధాన మంత్రి అన్నారు.

ఒకసారి రోగం జాడ ను కనిపెట్టిన తరువాత గంభీరమైనటువంటి రుగ్మతల ను తగు విధం గా చికిత్స అందించాలి అంటే, అధునాతనమైన ఆసుపత్రులు అవసరపడతాయి అని కూడా ప్రధాన మంత్రి అన్నారు. దేశం లో ప్రతి జిల్లా లో కనీసం ఒక వైద్య కళాశాల ను ఏర్పాటు చేయాలి అనే లక్ష్యాన్ని సాధించడం కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది అని ప్రధాన మంత్రి ప్రముఖం గా ప్రకటించారు. ఆరోగ్య రంగం లో మౌలిక సదుపాయాల ను కల్పించే ఉద్యమం లో భాగం గా ఆయుష్మాన్ భారత్ పథకం 64 వేల కోట్ల రూపాయల ఖర్చు తో జిల్లా స్థాయి లో ఆధునిక ఆరోగ్య సదుపాయాల ను నిర్మించే పని లో నిమగ్నం అయింది అని ఆయన తెలిపారు. దేశం లో కేవలం 7 ఎఐఐఎమ్ఎస్ లు ఉన్న కాలం అంటూ ఒకటి ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 21 కి పెరిగింది అని ప్రధాన మంత్రి పునరుద్ఘాటించారు. దేశం లో వివిధ ప్రాంతాల లో సుమారు 40 కేన్సర్ ఇన్ స్టిట్యూట్ ల స్థాపన కు ప్రభుత్వం ఆమోదాన్ని తెలపగా, వాటిలో చాలా వరకు ఆసుపత్రులు ఈ సరికే సేవల ను అందించడం మొదలు పెట్టాయి అని ఆయన అన్నారు.

ఒక ఆసుపత్రి ని నిర్మించడం ముఖ్యమైనట్లే, మంచి వైద్యుల ను, ఇతర పారామెడిక్స్ ను తగినంత మందిని కలిగి ఉండటం అనేది కూడా అంతే ప్రధానమైన విషయం అవుతుంది అని ప్రధాన మంత్రి నొక్కి చెప్పారు. ఈ కార్యాన్ని ప్రస్తుతం దేశం లో ఉద్యమ తరహా లో అమలు పరచడం జరుగుతోంది అని ఆయన పునరుద్ఘాటించారు. "2014వ సంవత్సరం కంటే పూర్వ కాలం లో దేశం లో ఉన్న వైద్య కళాశాలలు 400 లకు మించలేదు. అంటే 70 సంవత్సరాల లో 400 కంటే తక్కువ సంఖ్య లో వైద్య కళాశాలలు ఉన్నాయి అన్నమాట. కాగా, గత 8 సంవత్సరాల కాలం లో 200 లకు పైచిలుకు సంఖ్య లో కొత్త వైద్య కళాశాలల ను నిర్మించడం జరిగింది'' అని ప్రధాన మంత్రి అన్నారు. ప్రభుత్వం 5 లక్షల కు పైగా ఆయుష్ వైద్యుల ను అలోపతి ని అనుసరించే వైద్యులు గా గుర్తించింది. మరి, ఈ పరిణామం భారతదేశం లో వైద్యుడు–రోగి నిష్పత్తి మెరుగుపడటం లో తోడ్పడింది అని ప్రధాన మంత్రి వివరించారు. ఆయుష్మాన్ భారత్ పేదల కు 5 లక్షల రూపాయల వరకు విలువైన ఉచిత చికిత్స ను సమకూర్చింది. మరి దీనికి ఫలితమా అన్నట్లుగా 3.5 కోట్ల మంది రోగులు ఇంతవరకు చికిత్స పూర్తి చేసుకొన్నారు అని ఆయన అన్నారు. ఈ 3.5 కోట్ల మంది రోగుల లో చాలా మంది కేన్సర్ రోగులే అని కూడా ప్రధాన మంత్రి తెలియ జేశారు. ఆయుష్మాన్ భారత్ పథకం రోగుల యొక్క డబ్బులో ఇంచుమించు 40 వేల కోట్ల రూపాయల ను ఆదా చేసింది అని ఆయన తెలిపారు. కేన్సర్ చికిత్స కు వాడేటటువంటి 500 లకు పైచిలుకు మందుల ధరల లో 90 శాతం వరకు తగ్గుదల చోటు చేసుకోవడం తో ఒక వేయి కోట్ల రూపాయల వరకు ఆదా అయ్యాయి అని ఆయన వెల్లడించారు.

మొట్టమొదటి సారిగా ఆరోగ్య రంగం లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అంత పెద్ద స్థాయి లో వినియోగించడం జరుగుతోంది అని ప్రధాన మంత్రి అన్నారు. ఆయన తన ప్రసంగాన్ని ముగించే ముందు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ హెల్త్ మిశన్ అనేది ప్రతి ఒక్క రోగి సకాలం లో అతి తక్కువ స్థాయి ఇబ్బందుల ను ఎదుర్కొంటూనే నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సదుపాయాల కు నోచుకొనేటట్లు పూచీ పడుతున్నది అని పేర్కొన్నారు. భారతదేశం లో రూపుదిద్దుకొనే 5జి సేవలు త్వరలో ఆరంభం అయిన అనంతరం రిమోట్ హెల్త్ కేర్ సెక్టర్ విప్లవాత్మకమైన విధం గా మార్పుల కు ఆలవాలం అవుతుందని ప్రధాన మంత్రి ప్రముఖం గా ప్రస్తావించారు. "ఇది పేద కుటుంబాలు వారి గ్రామం నుంచి బయలుదేరి వదే వదే పెద్ద ఆసుపత్రుల ను సందర్శించక తప్పని స్థితి ని కుదించి వేస్తుంది'' అని ఆయన అన్నారు. కేన్సర్ వల్ల ఎదురయ్యే కుంగుబాటుతో రోగులు, వారి కుటుంబాలు ఎదురొడ్డి నిలచి పోరాటం చేసేటట్లుగా వారికి సాయ పడవలసిన అవసరం ఎంతైనా ఉంది అని కూడా ప్రధాన మంత్రి అన్నారు. "ఒక ప్రగతిశీలమైనటువంటి సమాజం గా, మానసిక స్వస్థత విషయం లో మనకు ఉన్న ఆలోచనల లో మార్పు ను మరియు దాపరికానికి తావు ఉండనటువంటి వైఖరిని ప్రవేశ పెట్టవలసిన బాధ్యత సైతం మన మీద ఉంది. అది జరిగితేనే ఈ సమస్య కు ఒక సరి అయినటువంటి పరిష్కార మార్గాన్ని కనుగొనడం సాధ్యమవుతుంది'' అని ఆయన అన్నారు.

పంజాబ్ మరియు పంజాబ్ చుట్టుపక్కల రాష్ట్రాల కు, ఇంకా కేంద్ర పాలిత ప్రాంతాల నివాసుల కు ప్రపంచ శ్రేణి కేన్సర్ సంరక్షణ ను అందించే ప్రయత్నం లో భాగం గా 'హోమీ భాభా కేన్సర్ హాస్పిటల్ ఎండ్ రిసర్చ్ సెంటర్' ను సాహిబ్ జాదా అజీత్ సింహ్ నగర్ జిల్లా మొహాలీ లోని న్యూ చండీగఢ్ పరిధి లో గల ముల్లాన్ పుర్ లో దేశ ప్రజల కు ప్రధాన మంత్రి అంకితం చేశారు. ఈ ఆసుపత్రి ని 660 కోట్ల రూపాయల కు పైగా వ్యయం తో భారత ప్రభుత్వ అణుశక్తి విభాగాని కి చెందిన ఒక ఎయిడెడ్ ఇన్ స్టిట్యూట్ అయినటువంటి టాటా మెమోరియల్ సెంటర్ నిర్మించింది.

ఈ కేన్సర్ ఆసుపత్రి 300 పడకల ను కలిగిన, ఇన్ పేషెంట్ లకు మూడో స్థాయి కి చెందిన అభివృద్ధిపరచిన ఆరోగ్య సంరక్షణ సేవల ను, చికిత్సల ను అందించేటటువంటి ఆసుపత్రి గా ఉండబోతోంది; మరి దీనిలో అన్ని రకాలైన కేన్సర్ కు సంబంధించిన చికిత్స ల కోసం ఆధునిక సదుపాయాలను జతపరచడమైంది. ఇక్కడ శస్త్ర వైద్యం/చికిత్స, ఎక్స్ రే చికిత్స, మెడికల్ ఆంకాలజి– కీమో థెరపి, ఇమ్యూనో థెరపి మరియు ఎముక మజ్జ మార్పిడి వంటి సౌకర్యాలు అందుబాటు లో ఉంటాయి.

ఈ ఆసుపత్రి యావత్తు ప్రాంతం లో కేన్సర్ సంరక్షణ మరియు చికిత్సల కు 'కేంద్రం' గా పని చేయనుంది. కాగా సంగ్ రూర్ లోని 100 పడకల ఆసుపత్రి ఈ కేంద్రాని కి 'శాఖ' గా విధుల ను నిర్వర్తించనుంది.

# సీఎం పర్యటనకు చకచకా ఏర్పాట్లు -మంత్రి కొప్పుల ఈశ్వర్



కరీంనగర్ , ఆగష్టు 25: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన కోసం ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. గురువారం నూతన కలెక్టరేట్ భవనాన్ని, బహిరంగ సభ జరిగే మైదానాన్ని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ? ఈనెల 29న ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయాన్ని, తెరాస జిల్లా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారన్నారు. అనంతరం లక్ష మందితో నిర్వహించే బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారన్నారు. ముఖ్యమంత్రి సభ కోసం జిల్లాలోని అన్ని నియోజక వర్గాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, కలెక్టర్ సంగీత సత్యనారాయణ, డీసీపీలు రూపేష్, అఖిల్ మహజన్, అదనపు కలెక్టర్లు లక్ష్మినారాయణ, కుమార్ దీపక్, సీఐలు ప్రదీప్‌కుమార్, అనిల్‌కుమార్, గ్రంథాలయ చైర్మన్ రఘువీర్‌సింగ్‌లు పాల్గొన్నారు.

# సీఎం సభకు భారీ బందోబస్తు.. అడిషనల్ డీజీ నాగిరెడ్డి




కరీంనగర్ , ఆగష్టు 25: తెలంగాణ ముఖ్యమంత్రి పర్యటన కోసం పెద్దపెల్లి జిల్లా కేంద్రంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు మల్టీజోన్ వన్ అడిషనల్ డీజీ నాగిరెడ్డి పేర్కొన్నారు. ఈనెల 29న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించే కలెక్టరేట్ భవనాన్ని ఈరోజు పరిశీలించారు. అనంతరం బహిరంగ సభ స్థాయిని పరిశీలించి బందోబస్తుపై అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం పర్యటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి సిపి సత్యనారాయణ, డిసిపిలు రూపేష్, అఖిల్ మహాజన్, ఏసిపి సారంగపాణి, సిఐలు ప్రదీప్ కుమార్, అనిల్ కుమార్ తో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి కార్పొరేట్ - వినోద సౌకర్యాలతో వారసత్వ విలువ కలిగిన పునరుద్ధరిత యుకె నిర్మిత ప్రత్యేక పాడల్ స్టీమర్

న్యూఢిల్లీ,ఆగష్టు 25: యుకెలోని డంబర్టన్ ఓడరేవులో 1914లో నిర్మించిన పాడల్ స్టీమర్ (ఆవిరితో, తెడ్ల వంటి చక్రాలతో నడిచే చిన్న ఓడ) పిఎస్ భోపాల్ను శిక్షణా వాహనంగా కోలకతాలోని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ పోర్టులో (గతంలో కోల్‌కతా పోర్ట్ ట్రస్టుగా తెలిసిన) నెం.22 కెపిడిలో ఉపయోగిస్తున్నారు. ఈ చిన్న ఓడ 63 మీటర్ల పొడవు, 9.2 మీటర్ల వెడల్పుతో ఉంది. శిక్షణా సంస్థతో లీజు ఒప్పందం 2019లో పూర్తి కావడంతో, ఎస్ఎంపి కోల్‌కతా వారసత్వ సంపద విలువ కలిగిన ఈ చిన్న ఓడను పునరుద్ధరించి, ప్రజల సందర్శించేందుకు ఉంచాలని భావిస్తోందని ఎస్ఎంపి కోల్‌కతా చైర్మన్ శ్రీ వినీత్ కుమార్ తెలిపారు. ఇందుకు అనుగుణంగా, ఆ సమయంలో శిథిలావస్థలో ఉండి, స్వీయ చోదన వ్యవస్థలేని చిన్న ఓడను ఎస్ఎంపి కోల్‌కతా దీర్ఘకాలిక లీజుకు తీసుకుంది.

లీజు వ్యవధిలో చిన్న ఓడ ఎస్ఎంపి కోల్‌కతా ఆస్తిగా ఉంటుందనే షరతుతో బహిరంగ టెండరింగ్ ద్వారా దీర్ఘకాలిక లీజుకు ఎంపిక జరిగింది. లీజు షరతుల ప్రకారం, పిఎస్ భోపాల్ ఓడుకు పక్కన గల లంగరు వేసే స్థలంలో లేదా రేవు కట్ట వద్ద ఉండటమే కాక తన స్వంత శక్తితో స్వీయచోదనాన్ని కలిగి ఉంటుంది. ఆ చిన్న ఓడ ప్రదర్శనకు స్థలం, రెస్టారెంటు, చిన్న అసెంబ్లీ తదిరాలను కలిగి ఉంటుంది.

పైన పేర్కొన్న చిన్న ఓడ పూర్తి అయ్యే క్రమంలో ఉంది. ఆ ఓడను ఎక్కే ప్రయాణీకుల భద్రతను నిర్ధారించేందుకు నదిలో కొన్ని ట్రయల్స్ జరిగాయి. పైన పేర్కొన్న పునరుద్ధరించిన చిన్న ఓడను ప్రారంభించేందుకు ఎస్ఎంపి కోల్‌కొతా యోచిస్తోంది. ఎస్ంపి కోల్‌కతా చైర్మన్ శ్రీ వినీత్ కుమార్ ప్రకారంభారత ఉపఖండంలో తొట్టతొలి వాహనాన్ని వచ్చే నెల నుంచి ప్రారంభించనున్నారు.

ప్రస్తుతం తెడ్డు పని చేయనప్పటికీ, పడవ ప్రాథమికి వ్యవస్థను మార్చకుండా, చోదన శక్తి కలిగిన కొత్త ప్రధాన ఇంజన్‌ను అందులో అమర్చారు. తద్వారా 1944లో దానిని నిర్మించిన సమయంలోని అనుభూతిని పడవ ఎక్కిన ప్రయాణీకులు నదిలో విహరించినప్పుడు కలిగేలా ఈ మార్పులు చేశారు.

# గుడ్ బై వైసీసీ.. సారీ సీఎం జగన్'.. వైసీపీకి కాటసాని రాజీనామా!

అమరావతి, ఆగష్టు 25: వైసీపీలో అంతర్గత విభేధాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. మొన్న గుంటూరులో మాజీ మంత్రి ఇంటి వద్ద ఎమ్మెల్యే దీక్షకు దిగగా.. సీఎం సొంత జిల్లాలో మరో సీనియర్ నాయకుడు జగన్‌కు షాకిచ్చారు. బనగానపల్లికి చెందిన సీనియర్ వైసీపీ నేత కాటసాని రమాకాంత్‌రెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు ఫేస్‌బుక్ వేదికగా ఒక వాక్యం రాసిన కాటసాని.. అటు పార్టీ కార్యకర్తలకు, ఇటు అధిష్టానాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తారు. గుడ్బై బై వైఎస్సార్‌సీపీ..!!! సారీ సీఎం వైఎస్ జగన్' అంటూ ఏక వాక్యంతో ఫేస్‌బుక్ పేజీలో తన రాజీనామా నిర్ణయాన్ని కాటసాని రమాకాంత్‌రెడ్డి ప్రకటించారు. తానెందుకు పార్టీకి రాజీనామా చేస్తున్నదీ వెల్లడించలేదు. కాటసాని కుటుంబానికి చెందిన కీలక నేత పార్టీకి గుడ్‌బై చెప్పడంతో నంద్యాల, బనగానపల్లి రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. రమాకాంత్‌రెడ్డి ప్రస్తుత ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సోదరుడి కుమారుడు. ప్రస్తుతం అవుకు మండలం పరిధిలోని గుండ్ల సింగవరం గ్రామ సర్పంచ్‌గా ఉన్నారు. ఇప్పటివరకు కాటసాని కుటుంబం మొత్తం వైసీపీలో ఉన్నది. ఈ నేపథ్యంలో రమాకాంత్‌రెడ్డి పార్టీని వీడటం చర్చనీయాంశంగా మారింది.

# అన్ని రకాల ఉగ్రవాదాలను నిర్మూలించడంలో ఎస్‌సీఓ సభ్య దేశాలు కలిసి పోరాడాలి: రక్షణ మంత్రి

న్యూఢిల్లీ,ఆగష్టు 25: రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (రాఅూ)ని ఉగ్రవాదానికి వ్యతిరేకంగా, ఐక్యంగా పోరాడాలని, అన్ని రకాల ఉగ్రవాదాలను నిర్మూలించాలని పిలుపునిచ్చారు. ఆగస్ట్ 24, 2022న ఉజ్బెకిస్తాన్‌లోని తాష్కెంట్‌లో జరిగిన ఎస్‌సీఓ రక్షణ మంత్రుల సమావేశంలో ప్రసంగిస్తూ, రక్షణ మంత్రి, సరిహద్దు ఉగ్రవాదంతో సహా ఏ రూపంలోనైనా ఉగ్రవాదాన్ని ఎవరైనా మరియు ఏ ఉద్దేశ్యంతో చేసినా మానవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరమని తెలిపారు.

"ప్రపంచ శాంతి, భద్రతలకు తీవ్రవాదం అత్యంత తీవ్రమైన సవాళ్లలో ఒకటి. అన్ని రకాల ఉగ్రవాదంపై పోరాడాలని, ఈ ప్రాంతాన్ని శాంతియుతంగా, సురక్షితమైనదిగా, సుస్థిరంగా మార్చేందుకు భారత్ తన సంకల్పాన్ని పునరుద్ఘాటిస్తోంది. ఎస్‌సీఓ సభ్య దేశాలతో ఉమ్మడి సంస్థాగత సామర్థ్యాలను అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తున్నాం, ఇది ప్రతి దేశం యొక్క సున్నితత్వాన్ని గౌరవిస్తూ, వ్యక్తులు, సమాజాలు మరియు దేశాల మధ్య సహకార స్ఫూర్తిని సృష్టిస్తుంది" అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

ఈ నేపథ్యంలో, ఎస్‌సీఓ సభ్య దేశాల రక్షణ మంత్రిత్వ శాఖల కోసం రక్షణ మంత్రి 2023లో 'మానవతా సహాయం మరియు విపత్తు ఉపశమనం – రిస్క్ మిటిగేషన్ మరియు డిజాస్టర్ రెసిలెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' అనే అంశంపై వర్క్‌షాప్‌ను భారత్‌లో నిర్వహించాలని ప్రతిపాదించారు. ఎస్‌సీఓ దేశాల రక్షణ థింక్ ట్యాంకుల మధ్య 'ఆసక్తి అంశం'(టాపిక్ ఆఫ్ ఇంట్రెస్ట్) పై వార్షిక సెమినార్‌ను కూడా నిర్వహించాలని ఆయన సూచించారు. 2023లో భారతదేశంలో మొదటి డిఫెన్స్ థింక్ ట్యాంక్ సెమినార్‌ను నిర్వహించాలని ప్రతిపాదిస్తున్నట్లు మంత్రి చెప్పారు.

శాంతియుత, సురక్షితమైన ఒ సుస్థిరమైన ఆఫ్ఘనిస్తాన్‌కు భారతదేశం యొక్క పూర్తి మద్దతును ఇస్తామని రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారుల. అదే సమయంలో దాని సార్వభౌమత్వం, స్వాతంత్ర్యం, ప్రాదేశిక సమగ్రత, జాతీయ ఐక్యత మరియు అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోబోమని తెలిపారు. అఫ్ఘనిస్తాన్‌లో చర్చలు ద్వారా జాతీయ సయోధ్యను సాధించేందుకు, దేశంలో విస్తృతమైన, సమ్మిళిత, ప్రాతినిధ్య రాజకీయ నిర్మాణాన్ని స్థాపించడానికి అధికారులను ప్రోత్సహించాలని ఆయన అన్ని దేశాలను కోరారు. ఈ విషయంలో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యుఎన్‌ఎస్‌సి) తీర్మానాల ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు.

ఉగ్రవాదులకు సురక్షిత శిక్షణ అందించడం, ఆర్థిక సహాయం ద్వారా వారి కార్యకలాపాలకు మద్దతు ఇవ్వడం ద్వారా ఏ దేశాన్ని భయపెట్టడానికి లేదా దాడి చేయడానికి ఆఫ్ఘన్ భూభాగాన్ని ఉపయోగించకూడదని రక్షణ మంత్రి తెలిపారు. ఆఫ్ఘనిస్థాన్ ప్రజలకు తక్షణ మానవతా సహాయం అందించి వారి ప్రాథమిక హక్కులను కాపాడాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు.

ఉక్రెయిన్‌లో పరిస్థితిపై భారతదేశం ఆందోళన వ్యక్తం చేసిన రాజ్‌నాథ్ సింగ్, ఈ సంక్షోభాన్ని పరిష్కరించడానికి రష్యా–ఉక్రెయిన్ మధ్య చర్చలకు భారత్ మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. ఉక్రెయిన్ దాని చుట్టుపక్క ప్రాంతాల్లో మానవతా సంక్షోభం గురించి భారత్ ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. మానవతా సహాయం అందించడానికి ఐరాస ప్రధాన కార్యదర్శి, యూఎన్ ఏజెన్సీలు మరియు ఇంటర్నేషనల్ కమిటీ ఆఫ్ రెడ్ క్రాస్ (ఎఅఖీఅ) ప్రయత్నాలకు మద్దతు అందించిన విషయాన్ని తెలిపారు.

భారత్ ఎస్‌సీఓ దేశాలతో ఎన్నో ఏళ్లుగా ఉన్న సంబంధాలపై రాజ్‌నాథ్ సింగ్ సమావేశంలో ప్రస్తావించారు. ఎస్‌సీఓ సభ్య దేశాలు ఈ ప్రాంతం యొక్క పురోగతి, శ్రేయస్సులో ఉమ్మడి వాటాదారులని చెప్పారు. "బహుపాక్షికతపై నమ్మకం ఉన్నందున భారత్ ఎస్‌సీఓకి అధిక ప్రాధాన్యతనిస్తుంది. సమానత్వం, గౌరవం, పరస్పర అవగాహన ఆధారంగా సంస్థ సభ్య దేశాల మధ్య ద్వైపాక్షికంగా సంబంధాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. వచ్చే ఏడాది ఉజ్బెకిస్తాన్ నుండి ఆర్గనైజేషన్ అధ్యక్ష పదవిని భారత్ చేపట్టినప్పుడు భారతదేశాన్ని సందర్శించాలని రక్షణ మంత్రి సభ్య దేశాలను ఆహ్వానించారు.

నిన్న తన ఉజ్బెక్, కజఖ్ మరియు బెలారసియన్ ప్రత్యర్థులతో ద్వైపాక్షిక సమావేశాల తర్వాత, రక్షణ మంత్రి తరువాత కిర్గిస్థాన్ రక్షణ మంత్రిని కలవనున్నారు. నేడు రష్యా రక్షణ మంత్రి సెర్గీ షోయిగుతో మాటల సందర్భంగా, రాజ్‌నాథ్ సింగ్ భారతదేశంలో దాడులకు ప్లాన్ చేస్తున్న ఒక ఉగ్రవాదిని మాస్కోలో అరెస్టు చేసినందుకు తన ప్రగాఢమైన అభినందనలు మరియు ధన్యవాదాలు తెలియజేశారు.

# జలప్రవేశానికి స్వదేశీ యుద్ధ నౌక విక్రాంత్ సిద్ధం..



న్యూఢిల్లీ,ఆగష్టు 25: స్వదేశీ యుద్ధ నౌక విక్రాంత్‌ను సెప్టెంబర్ 2వ తేదీన జల ప్రవేశం చేయనున్నారు. కొచ్చిలో జరిగే కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొంటారు. సుమారు 40 వేల టన్నులకుపైగా బరువు ఉన్న యుద్ధ నౌకల్ని తయారు చేసిన దేశాల జాబితాలో ఇండియా చేరినట్లు ఇండియన్ నేవీ కమాండర్ థాపర్ తెలిపారు. ఈ జాబితాలో అమెరికా, బ్రిటన్, రష్యా, చైనా, ఫ్రాన్స్ దేశాలు ఉన్నాయి. స్వదేశీ యుద్ధ నౌక విక్రాంత్‌లో 2200 కంపార్ట్‌మెంట్లు ఉన్నాయి. మహిళా ఆఫీసర్లకు, మహిళా అగ్నివీరులకు వసతి సౌకర్యాలు సపరేట్‌గా ఉంటాయని ఇండియన్ నేవీ పేర్కొన్నది. విక్రాంత్ యుద్ధ నౌక కోసం సుమారు 18 రాష్ట్రాల నుంచి ఎక్విప్మెంట్ అందినట్లు వైస్ అడ్మిరల్ ఎస్ఎన్ ఘోర్‌మేడ్ తెలిపారు. అంబాలా, దామన్, కోల్‌కతా, జలంధర్, కోటా, పూణె, న్యూఢిల్లీ నుంచి విక్రాంత్‌కు కావాల్సిన ఎక్విప్మెంట్ అందినట్లు తెలిపారు.

ఐఎన్ఎస్ విక్రాంత్‌కు కావాల్సిన మొత్తం 2500 కిలోమీటర్ల పొడువైన కేబుల్‌ను ఇండియాలోనే తయారు చేసినట్లు వైస్ అడ్మిరల్ తెలిపారు. ఇది గొప్ప అచీవ్‌మెంట్ అన్నారు. యుద్ధ నౌకకు కావాల్సిన స్టీల్‌ను ఇండియన్ ఆర్మీ, డీఆర్డీవో, సెయిల్ సహకారంతో తయారు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ స్టీల్‌ను ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేయనున్నట్లు చెప్పారు. మిగ్–29కే ఆపరేషన్ కోసం విక్రాంత్‌ను డిజైన్ చేశామని, అయితే స్వదేశీయంగా తయారైన టెడ్‌బీఎఫ్ ఫైటర్ విమానాన్ని కూడా వాడనున్నట్లు ఘోర్‌మేడ్ తెలిపారు. రాఫెల్, ఎఫ్–18 విమానాల ట్రయల్స్‌ను కూడా నిర్వహించినట్లు ఆయన చెప్పారు.

# పెద్దపులి సంచారం.. భయాందోళనలో ప్రజలు

అమరావతి, ఆగష్టు 25: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగరం జిల్లాలో పెద్దపులి సంచరించింది. జిల్లాలోని బాడంగి మండలం అల్లుపాల్తేరులో పులి ఆవుని హతమార్చింది. వరుస పులి ఘటనలతో పలు గ్రామాల ప్రజలు హడలెత్తిపోతున్నారు. పులి తిరుగుతోందని అటవీశాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో గ్రామాల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పులి తిరుగుతోందని నిర్ధారణకే పరిమితమయ్యారని అటవీ శాఖ అధికారుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. పెద్దపులి గ్రామాల్లోకి వచ్చి ఆవును చంపడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

# మూడవ విడత ప్రజా సంగ్రామ యాత్ర ముగింపు సభ విజయవంతం చేయాలి-బీజేపీ



## -అసెంబ్లీ ఇంఛార్జి కాటిపల్లి వెంకట రమణ రెడ్డి

కామారెడ్డి, ఆగష్టు 25: (నేటినిజం ప్రతినిధి)బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ గారు చేపట్టిన మూడవ విడత ప్రజా సంగ్రామ యాత్ర ముగింపు సభ ను విజయవంతం చేయాలని బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ ఇంఛార్జి కాటిపల్లి వెంకట రమణా రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వరాష్ట్రంలో ప్రజల గోసలు తెలుసుకోవడం కోసం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ గారు చేపట్టిన ప్రజా సంగ్రామ యాత్ర ముగింపు సభ ఈ నెల 27 వ తేదీన హన్మకొండ ఆర్ట్స్ కళాశాల మైదానం మధ్యాహ్నం 2 గంటలకు ఉంటుందని కావున ఈ సభలో ప్రతి కార్యకర్త పాల్గొని భహిరంగ సభ ను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కామారెడ్డి పట్టణంలో పాటు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో బహిరంగ సభ కు పోవడానికి వాహనాలు ఏర్పాటు జరుగుతుందని బూత్ స్థాయి కార్యకర్త ల నుండి మండల జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు అందరూ కూడా తప్పక రావాలని పిలుపునిచ్చారు.

# సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



మహబూబాబాద్, ఆగష్టు 25: (నేటినిజం ప్రతినిధి): పెద్ద వంగర మండల కేంద్రంలో సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేయటం జరిగింది. కార్పొరేట్ హాస్పిటల్లో వైద్యం చేయించుకున్న వారికి వైద్య ఖర్చులు ఇచ్చి పేద ప్రజలను కాపాడుకుంటున్న ఏకైక ముఖ్యమంత్రి కెసిఆర్ అని ఈదురు ఐలయ్య తెరాస మండల పార్టీ అధ్యక్షులు పెద్దవంగర అన్నారు.

మండల తెరాన పార్టీ కార్యాలయంలో ఎర్రబెల్లి దయాకర్ రావు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సహకారంతో గంట్లకుంట గ్రామానికి చెందిన చింతల ప్రభాకర్ కు 17500=00 రూపాయలు మరియు అవుతాపురం గ్రామానికి చెందిన రాసాల రేణుక కు 47500=00 రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణి చేయడం జరిగిందని తెలిపారు.

ఈ రెండు చెక్కుల మొత్తం విలువ 65000=00 రూపాయలు అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీరాం సంజయ్,గంట్లకుంట సర్పంచ్ చింతల భాస్కర్, మండల కోఆప్షన్ సభ్యులు ముజీబ్, నాయకులు సలీదండి సుధాకర్, గాజుల ప్రసాద్, బొమ్మరబోయిన రాజు,మండల ప్రచార కార్యదర్శి లింగాల రమేష్,రైతు కోఆర్డినేటర్ ఈరెంటి శ్రీనివాస్,మాజీ ఉపసర్పంచ్ కోట అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్స్ పేరుతో కార్మిక హక్కులు హరించవద్దు




తిరుపతి, ఆగష్టు 25: వామపక్షాలు, వాటి అనుబంధంగా ఉన్నటువంటి కార్మిక సంఘాలు గురువారం తాజ్ హోటల్ నందు జరగనున్న కార్మికశాఖ జాతీయ సదస్సు కార్యక్రమాన్ని అడ్డుకుంటామని పిలుపునివ్వడంతో నగరంలో వామపక్ష కార్యాలయం దగ్గర, నాయకులు ఇంటి వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టి అరెస్టులు చేయడం జరిగింది. బైరాగి పట్టెడ వద్ద నిరసన ర్యాలీ చేస్తున్న ఏ.ఐ.టి.సి రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్. కుమార్ రెడ్డిలతోపాటు పలువురు నాయకులను, కార్యకర్తలను అరెస్ట్ చేశారు. అలాగే స్థానిక బేరి వీధి పంచముఖి ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర మాజీ పార్లమెంటు సభ్యులు మధు.. మాజీ ఎమ్మెల్యే, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ గఫూర్, ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్, సిఐటియు నాయకులు కందారపు మురళి అరెస్టు జరుగుతుందని వివరించారు.

44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేస్తుందని ధ్వజమెత్తారు. ప్రధాని నరేంద్ర మోడీ అధికారం చేపట్టిన తర్వాత కార్మిక హక్కులను కాలరాయడం జరుగుతుందని వివరించారు. ఎక్కడైనా సభలు పెట్టుకోవచ్చని రాజ్యాంగం చెబుతుందని, చట్టధిక్కారమైనట్టు పోలీసులు వామపక్ష కార్యాలయం దగ్గర దిగ్బంధనం చేయడం ఏమిటని వారు విమర్శించారు. ముఖ్యమంత్రి మీ పద్ధతి ఏమిటి.. ప్రజాస్వామ్యం బతికి ఉందని అనుకుంటున్నాం.. మీరు చంపేస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యం బతికి ఉంటేనే మీరు ముఖ్యమంత్రి అయ్యారని.. ప్రజాస్వామ్యం చనిపోతే మీరు ఎలా ముఖ్యమంత్రి అవుతారని తెలియజేశారు. ఇది ప్రజాస్వామ్య దేశం నిరసన తెలియజేసే హక్కు ఉంది.. రాను రాను కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. ఇంకనైనా కేంద్ర ప్రభుత్వం లేబర్ కోర్టు చట్టాన్ని రద్దు చేయకపోతే ఆందోళన మరింత తీవ్రతరం చేస్తామని, కేసులకు, జైలుకు భయపడేది లేదని, ఉంటే జైల్లో అయినా.. తమ నిరసన రోడ్డుపైన తెలియజేస్తామని వారు హెచ్చరించారు.

# ఇంజక్షన్ వికటించి బాలుడు మృతి.. ఆస్పత్రి ఎదుట ఆందోళన..



నిజామాబాద్, ఆగష్టు 25: ఇంజక్షన్ వికటించి నాలుగు నెలల బాలుడు మృతిచెందాడని ప్రభుత్వ ఆస్పత్రి ముందు ఆందోళన నిర్వహించారు. నిజామాబాద్ జిల్లాలోని భీంగల్ మండలం లింబాద్రి గుట్టకు చెందిన వేముల కార్తీక్ (4 నెలలు) ఇంజక్షన్ వికటించి మృతి చెందినట్లు ఆరోపిస్తూ ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు.

బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. లింబాద్రి గుట్టకు చెందిన వేముల రమ్య తన నాలుగు నెలల కుమారుడుకి ఈనెల 24న బాబాపూర్ సబ్ సెంటర్ లో ఐపీవీ ఇంజక్షన్ రెండో డోస్ ఇప్పించారు.

ఇంజక్షన్ ఇప్పించిన మరుసటి రోజు ఉదయం బాబు చనిపోయాడు. ప్రభుత్వ దవాఖాన సబ్ సెంటర్ లో ఇచ్చిన ఇంజక్షన్ ద్వారానే బాబు మృతి చెందాడని ఆగ్రహానికి గురైన కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట బైఠాయించి ధర్నాకు దిగారు.

# కృష్ణయ్య కుటుంబానికి రక్షణ కల్పించాలి : తుమ్మల

ఖమ్మం, ఆగష్టు 25: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం పోలీసు కమిషనర్ విష్ణు యస్ వారియర్ ను కలిసిన మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

తమ్మినేని కృష్ణయ్య హత్య కేసులో నిందితులపై చట్ట పరమైన చర్యలు తీసుకోని విచారణ వేగవంతం చేయాలి.

తమ్మినేని కృష్ణయ్య కుటుంబానికి రక్షణ కల్పించాలని సిపి విష్ణు యస్ వారియర్ ని కోరిన తుమ్మల నేడు తెల్దారుపల్లి లో తమ్మినేని కృష్ణయ్య దశదిన కర్మకు భారీగా తరలివచ్చిన టిఆర్ఎస్, కృష్ణయ్య అభిమానులుతెల్దారుపల్లి లో కొనసాగిన పోలీసు పహారా.

# సమస్యలు చెబితే.. పరిష్కరించే బాధ్యత మాది : మంత్రి నిరంజన్‌రెడ్డి



వనపర్తి, ఆగష్టు 25: ఒక్కటి కాదు, రెండు కాదు 50 చోట్ల ప్రభుత్వ అధికారులతో పల్లెనిద్రలు అనేది ఒక గొప్ప సందర్భానికి నాంది అని మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. వనపర్తి వజ్ర సంకల్పంలో భాగంగా పల్లెనిద్ర కార్యక్రమాన్ని ఆముదంబండ తండా, గార్లబండ తండాలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మంత్రి మార్నింగ్ వాక్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమానికి పథకాలను అమలు చేస్తుందన్నారు. వ్యవసాయానికి 24 గంటలు ఉచిత కరెంటు, గృహాలు, పారిశ్రామిక అవసరాలకు సైతం 24 గంటలు నిరంతరాయంగా కరెంటు ఇస్తున్నట్లు తెలిపారు.

రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్, అమ్మ ఒడి, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా పింఛన్లు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, మన ఊరు ? మన బడి, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, రోడ్ల నిర్మాణం, పల్లె పగ్రతి, పట్టణ ప్రగతిలో వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాల ఏర్పాటు, గత ఎనిమిదేళ్ల అనేక పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. సాగునీరందించి పంటల సాగు ప్రోత్సహించామన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పంటలను కొనుగోలు చేశామన్నారు. ఎనిమిదేళ్ల ఎన్నో చేశామని.. ఇంకా ఏం కావాలి? సమస్యలు ఏంటో చెబితే పరిష్కరించే బాధ్యత మాదేనంటూ భరోసా ఇచ్చారు.

గ్రామాలు, పట్టణాల్లో సమస్యల పరిష్కారంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడమే తమ ఉద్దేశమన్నారు. తమ ఆలోచనలను ప్రజలు స్వాగతించారని, ఊరూరా వచ్చిన స్పందన ఎంతో ప్రోత్సాహం అందించిందన్నారు. భవిష్యత్‌లో అందరి సహకారంతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పల్లె నిద్రలు నిర్వహిస్తామన్నారు. 41 గ్రామాల్లో, తొమ్మిది వార్డుల్లో, ఏడు మండలాలు, రెండు మున్సిపాలిటీల్లో 53శాఖల అధికారులతో పల్లె నిద్ర కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు కృషి చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

# పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు మంత్రి చామకూర మల్లారెడ్డి

హైదరాబాద్, ఆగష్టు 25: పల్లెలు దేశానికి పట్టుకొమ్మలని, తెలంగాణలోని 12,700 గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు.

సీఎం దత్తత మండలం మూడుచింతలపల్లిలోని నాగశెట్టిపల్లి గ్రామంలో నూతనంగా రూ. 3.76 కోట్లతో నిర్మించిన అభివృద్ధి పనులను బుధవారం ప్రారంభించారు.

తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఇంటింటికీ తాగునీరు, నిరంతర విద్యుత్ ఇవ్వడమే కాకుండా దేశ చరిత్రలో కనీవిని ఎరగని తరహాలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబంధు, రైతుబీమా, కాళేశ్వరం ప్రాజెక్టు, దళితబంధు వంటి ఎన్నో పథకాలను రూపొందించి ప్రజలకు అందిస్తున్న మహానుభావుడు సీఎం కేసీఆర్ అని అన్నారు. మూడుచింతలపల్లి మండలాన్ని దత్తత తీసుకొని ప్రత్యేక నిధులతో ఆదర్శ మండలంగా అభివృద్ధి పరుస్తున్నట్లు వివరించారు.

నాగిశెట్టిపల్లిలో రూ. 3.76 కోట్లతో అభివృద్ధి చేయడం గొప్ప విషయమన్నారు. మూడుచింతలపల్లి మండలానికి తన సొంత నిధులు మల్లారెడ్డి సేవా ట్రస్ట్ ద్వారా వైకుంఠరథాన్ని అందించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఎంపీపీ హారిక, సర్పంచులు కృపాకర్‌రెడ్డి, జామ్ రవి, విష్ణువర్ధన్‌రెడ్డి, హరిమోహన్‌రెడ్డి, ఆంజనేయులు, ఇస్తారి, ఎంపీటీసీలు హనుమంత్‌రెడ్డి, నాగరాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు కంటం కృష్ణారెడ్డి, ఎంపీడీవో రవినాయక్, ఆర్ఎస్ఎస్ జిల్లా సభ్యుడు విష్ణుగౌడ్, వార్డు సభ్యులు, అధికారులు, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి అనిల్‌రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి చిత్తాగౌడ్, గోపాల్, మద్దుల శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మతం ముసుగులో ప్రజల మధ్య మంట పెడుతున్నదని మంత్రి మల్లారెడ్డి ధ్వజమెత్తారు.

శాంతియుత వాతావరణంలో కులమతాలకు అతీతంగా సాగిపోతున్న తెలంగాణ పాలనలో బీజేపీ పంచాయితీలు పెడుతున్నదన్నారు.

ప్రజల మధ్య మంట పెడుతున్న బీజేపీని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు.

ఆత్మీయ ఆహ్వానం
సాహితీ మాణిక్యం పురస్కార ప్రదాన సభ
28-8-2022 ఆదివారం 6 గంటలకు
దొడ్డి కొమరయ్య హాల్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైద్రాబాద్
అతిథులకు ఆహ్వానం : కవి యాకూబ్ , ప్రముఖ కవి
అధ్యక్షులు : జూలూరు గౌరీశంకర్, చైర్మన్, తెలంగాణ సాహిత్య అకాడమి
ముఖ్య అతిథులు
శ్రీ పువ్వాడ అజయ్‌కుమార్ రాష్ట్ర రవాణా శాఖామాత్యులు
శ్రీ సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వ్యవసాయ, మార్కెటింగ్ మరియు సహకార శాఖామాత్యులు
* * పురస్కార గ్రహీతలు (2020) * *
శ్రీ ఆకెళ్ళ రవిప్రకాష్ ఐ.ఏ.ఎస్. ప్రముఖ కవి ప్రభుత్వ కార్యదర్శి, పుదుచ్చేరి వ్యవసాయం, పశుపాలన, అటవీశాఖ
డా॥ షాజహానా ప్రముఖ కవయిత్రి, కథకులు, నవలాకారులు
* * పురస్కార గ్రహీతలు (2021) * *
శ్రీమతి జూపాక సుభద్ర ప్రముఖ రచయిత్రి, విమర్శకులు పూర్వ అదనపు సెక్రటరీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
శ్రీ వనపట్ల సుబ్బయ్య తెలంగాణ ఉద్యమకవి, నాగర్‌కర్నూల్ జిల్లా
ఆత్మీయ అతిథులు :
శ్రీ శిఖామణి ప్రముఖ కవి | శ్రీ డా. ఎస్. రఘు కవి, విమర్శకులు
శ్రీ కోట్ల వెంకటేశ్వరరెడ్డి ప్రముఖ కవి, కాళోజీ అవార్డు గ్రహీత | డా. పసునూరి రవీందర్ ప్రముఖ కవి, విమర్శకులు
శ్రీ వంశీకృష్ణ ప్రముఖ కవి, కథకులు | శ్రీ ఆనందాచారి ప్రముఖ కవి, తెలంగాణ సాహితి
పురస్కార కమిటీ : ఖాదర్ మొహియుద్దీన్ ప్రముఖ కవి, విర్శకులు | ప్రసేన్ ప్రముఖ కవి, పాత్రికేయులు
మువ్వా శ్రీనివాసరావు ప్రముఖ కవి | పి. రవిమారుత్ ప్రముఖ కవి, విద్యావేత్త
ఇట్లు :
ఆర్. వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఎ.సి.పి, హైద్రాబాద్ – ఆర్. శ్రీనివాసరావు & సీతారాం
రావులపాటి నారాయణ - మాణిక్యం స్మారక పురస్కార కమిటీ, ఖమ్మం

# 470 రోజుల నుండి నిరంతరంగా అన్నదానం




రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 25: (నేటినిజం ప్రతినిధి): మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ×దాతల సహకారంతో నిత్యాన్నదాన కార్యక్రమం ప్రారంభించి గురువారం నాటికి 470 రోజులు.చేరుకుంది .

గురువారం అన్నదాన కార్యక్రమం పట్టణంలోని లక్ష్మీ గణపతి కాంప్లెక్స్ ముందు, రాజన్న ఆలయ పార్కింగ్ స్థలంలో మరియు భీమేశ్వర ఆలయం ముందు గల 80 మంది అన్నర్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న రాజన్న ఆలయ డీ.ఈ. మధు రఘునందన్ మాట్లాడుతూ, కొన్ని కొన్ని సమయాల్లో మనకు భోజనం చేయడానికే సమయం దొరకదు అలాంటిది గత 470 రోజుల నుండి యాచకులకు, అన్నర్థులకు సమయపాలన పాటిస్తూ రాజన్న మనకు కల్పించిన అవకాశంగా భావించి అన్నదానం చేయడం అభినందనీయమని అన్నదానంలో పాల్గొన్న ట్రస్టు సభ్యలనుద్దేశించి అన్నారు. ఇలాంటి మహోన్నత కార్యక్రమంలో నన్ను భాగస్వామ్యున్ని చేసినందుకు ట్రస్టు వారికి కృతజ్ఞతలు తెలిపారు .గురువారం

అన్నదాతలుగా సర్వశ్రీ ఎదులాపురం రంజిత్, నగుబోతు రవీందర్, జువ్వాడి వెంకటేశ్వరరావు ఉన్నారు ఈ కార్యక్రమంలో మై వేములవాడ అన్నదాన గ్రూపు సభ్యులు ×మధు మహేష్, నాగుల చంద్రశేఖర్,ప్రతాప నటరాజు, పొలాస రాజేందర్, జూలపెల్లి రాజు, నీరటి తిరుమల్× తదితరులు పాల్గొన్నారు.

# గోధుమ లేదా మెస్లిన్ పిండి తాలూకు ఎగుమతి విధానానికి ఆమోదం తెలిపిన మంత్రిమండలి

న్యూఢిల్లీ,ఆగష్టు 25: ఎగుమతి పరమైనటువంటి ఆంక్షల నుంచి/ నిషేధం నుంచి గోధుమ లేదా మెస్లిన్ పిండి (హెచ్ఎస్ కోడ్ 1101) ని మినహాయించడం కోసం తత్సంబంధి విధానం లో సవరణ కు ఉద్దేశించిన ప్రతిపాదన కు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షత న జరిగిన ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ సంఘం (సిసిఇఎ) సమావేశం ఆమోదాన్ని తెలిపింది.

ఈ ఆమోదం ఇక గోధుమ పిండి ఎగుమతి పైన ఒక ఆంక్ష ను విధించడాని కి అనుమతి ని ఇస్తుంది. ఈ చర్య గోధుమ పిండి ధరల పెరుగుదల ను ఆటంకపరచడం తో పాటు గా సమాజం లోని అత్యంత దుర్బల వర్గాల కు ఆహార భద్రత పరం గా కూడాను పూచీపడగలదు.

డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డిజిఎఫ్ టి) ఈ మేరకు ఒక నోటిఫికేశన్ ను జారీ చేయవలసివుంటుంది.

రష్యా మరియు యూక్రేన్ లు గోధుమల ప్రధాన ఎగుమతిదారు దేశాలు గా ఉన్నాయి. ప్రపంచం లో క్రయ విక్రయాలు జరిగేటటువంటి గోధుమలలో నాలుగింట ఒకటో వంతు వాటా రష్యా మరియు యూక్రేన్ లదే. కాగా రష్యా మరియు యూక్రేన్ ల మధ్య ఘర్షణ ప్రపంచ గోధుమల సప్లయ్ చైన్ లో అంతరాయాలకు దారి తీసి భారతదేశం గోధుమలకు డిమాండు అధికం అయిపోయింది. తత్ఫలితం గా, దేశీయ బజారు లో గోధుమల ధరలు హెచ్చాయి. దేశం లో 1.4 బిలియన్ ప్రజల ఆహార భద్రత కు పూచీపడడం కోసం, గోధుమల ఎగుమతి పై ఒక నిషేధాన్ని అమలు చేయాలన్న నిర్ణయాన్ని 2022వ సంవత్సరం మే నెల లో తీసుకోవడమైంది.

అయితే, గోధుమ ఎగుమతి మీద నిషేధం అమలు లోకి తీసుకు వచ్చినందువల్ల ( దేశీయ బజారు లో పెరుగుతున్న ధరల ను అడ్డుకోవడానికి మరియు దేశం లో ఆహార భద్రత కు పూచీపడడానికి ఈ చర్య ను చేపట్టడమైంది), విదేశీ బజారుల లో గోధుమ పిండి కి డిమాండు వృద్ధి చెందడమే కాక భారతదేశం నుంచి గోధుమ పిండి ఎగుమతుల లో 2022వ సంవత్సరం లో ఏప్రిల్ మొదలుకొని జులై మధ్య కాలం లో 2021 వ సంత్సరం లోని సమాన కాలం తో పోల్చితే 200 శాతం మేరకు పెరుగుదల నమోదు అయింది.

అంతర్జాతీయ బజారు లో గోధుమ పిండి తాలూకు డిమాండు అధికం కావడం అనేది దేశీయ బజారు లో గోధుమ పిండి ధర లో గణనీయమైన పెరుగుదల కు దారితీసింది.

ఇంతకు ముందు, గోధుమ పిండి యొక్క ఎగుమతి పైన నిషేధాన్ని గాని లేదా ఎటువంటి ఆంక్షల ను గాని విధించరాదని ఒక విధానం ఉండింది. అందుకని, ఆహార భద్రత కు పూచీ పడడం కోసం మరియు దేశం లో అంతకంతకు ఎగబాకుతున్న గోధుమ పిండి ధరల కు అడ్డుకట్ట వేయడం కోసం గోధుమ పిండి కి సంబంధించిన ఎగుమతి పై నిషేధం/ఆంక్షల నుంచి మినహాయింపు ను ఉపసంహరించడం ద్వారా తత్సంబంధిత విధానం లో ఓ పాక్షిక సవరణ అవసరపడింది.

# ఏగిన మురళీ కుటుంబాన్ని పరామర్శించిన ఏనుగు మనోహర్ రెడ్డి



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 25: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపార వేత్త ఆర్యవైశ్య సత్రం అధ్యక్షులు ఏగిన మురళీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు .గురువారం వారి కుటుంబ సభ్యులను మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తెరాస సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శించారు మృతుని కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు . ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు మనోహర్ రెడ్డితో పాటు స్థానిక కౌన్సిలర్ నరాల శేఖర్ ,కట్కనీ కిషన్, నాగరాజు తదితరులు పరామర్శించి సంతాపం తెలిపారు

# వంట నూనెల తూకం ప్రకటించడంతోపాటు కొలతలో ఉష్ణోగ్రత లేకుండా నికర ద్రవ్యరాశి పరిమాణాన్ని కూడా ప్రకటించాలి-వంట నూనెలు ఉత్పత్తిదారులను కేంద్రం విజ్ఞప్తి

న్యూఢిల్లీ,ఆగష్టు 25: వంట నూనెల తయారీదారులు/ప్యాకర్లు/ దిగుమతిదారులకు, ఉష్ణోగ్రత లేకుండా పరిమాణంలో వంట నూనెలు మొదలైన వాటిపై నికర ద్రవ్యరాశి పరిమాణాన్ని ప్రకటించాలని కేంద్రం సూచించింది. ఉత్పత్తి యొక్క బరువుతో పాటు ఉష్ణోగ్రతను పేర్కొనకుండా నికర ద్రవ్యరాశి పరిమాణాన్ని ప్రకటించే లేబులింగ్‌ను, ఆదేశాలు జారీ చేసిన తేదీ నుండి ఆరు నెలలలోపు అంటే జనవరి 15, 2023 వరకు సరిచేయాలని వినియోగదారుల వ్యవహారాల విభాగం వారికి సూచించింది.

లీగల్ మెట్రాలజీ (ప్యాకేజ్డ్ కమోడిటీస్) రూల్స్, 2011 ప్రకారం, వినియోగదారుల ప్రయోజనాల దృష్ట్యా అన్ని ప్రీ–ప్యాకేజ్ చేయబడిన వస్తువులపై ఇతర ప్రకటనలతో పాటూ ప్రామాణిక యూనిట్లలో బరువు లేదా కొలతల పరంగా నికర ద్రవ్యరాశి పరిమాణాన్ని ప్రకటించడం తప్పనిసరి.

నియమాల ప్రకారం రూపొందించిన నిబంధనలను అనుసరించి, నికర పరిమాణంలో వంట నూనెలు, వనస్పతి నెయ్యి మొదలైనవాటిని బరువు లేదా ద్రవ్యరాశి పరిమాణంలో ప్రకటించాలి, అలాగే ద్రవ్యరాశి లో ప్రకటిస్తే, ఆ వస్తువు యొక్క సమానమైన బరువును తప్పనిసరిగా ప్రకటించాలి. ద్రవ్యరాశి లో నికర పరిమాణాన్ని ప్రకటించేటప్పుడు పరిశ్రమలు ముందుగానే ఉష్ణోగ్రత గురించి ప్రస్తావించడం గమనించవచ్చు. తయారీదారులు/ప్యాకర్లు/ దిగుమతిదారులు నికర పరిమాణంలో వంట నూనెలు మొదలైనవాటిని, ద్రవ్యరాశి యూనిట్లతో పాటు ప్యాకింగ్ సమయంలో ఉష్ణోగ్రతను పేర్కొంటూ ద్రవ్యరాశి లో ప్రకటిస్తున్నారు. కొంతమంది తయారీదారులు ఉష్ణోగ్రతను 600అ వరకు పేర్కొంటున్నారు.

వంట నూనెలు, వనస్పతి నెయ్యి మొదలైన వాటి ప్యాకేజింగ్ లో వేర్వేరు ఉష్ణోగ్రతల వద్ద ద్రవ్యరాశిని స్థిరంగా ఉంచడం (ఉదాహరణకు 1 లీటర్), నికర పరిమాణాన్ని ద్రవ్యరాశి పరంగా ప్రకటించడం వల్ల, అధిక ఉష్ణోగ్రత వద్ద ద్రవ్యం తేడా ఉంటుందని గమనించబడింది. సోయాబీన్ వంట నూనె యొక్క బరువు వేర్వేరు ఉష్ణోగ్రతల వద్ద ఒక లీటరు వేర్వేరు ఉష్ణోగ్రతల వద్ద ద్రవ్యరాశి భిన్నంగాఈ క్రింది విధంగా ఉంటుంది.

కాబట్టి, వివిధ ఉష్ణోగ్రతల వద్ద వంట నూనెలు బరువు భిన్నంగా ఉంటుంది. అందువల్ల, వినియోగదారు కొనుగోలు సమయంలో ప్యాకేజీలో సరైన ద్రవ్యరాశి పరిమాణాన్ని పొందారని నిర్ధారించుకోవడానికి, తయారీదారులు / ప్యాకర్లు / వంట నూనెల దిగుమతిదారులు మొదలైనవారు పేర్కొన్న ఉత్పత్తులను ఉష్ణోగ్రతను పేర్కొనకుండా ప్యాక్ చేయాలని మరియు ప్రకటించిన పరిమాణాన్ని నిర్ధారించుకోవాలని సూచించారు. పరిమాణం మరియు ద్రవ్యరాశిలో ప్యాకేజీ సరిగ్గా ఉండాలి.

# భారత స్వాతంత్ర్య సంగ్రామ ఘట్టాల ఆధారంగా రూపొందించిన ఆన్‌లైన్ ఎడ్యుకేషనల్ గేమ్‌ల సిరీస్ ప్రారంభించిన కేంద్ర మంత్రి శ్రీ అనురాగ్ ఠాకూర్

న్యూఢిల్లీ,ఆగష్టు 25: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకలో భాగంగా భారత స్వాతంత్ర్య పోరాట కథలను ఆటల రూపంలో పరిచయం చేసేందుకు ' ఆజాదీ క్వెస్ట్ ' పేరిట రూపొందిన ఆన్‌లైన్ విద్యా మొబైల్ గేమ్‌ల శ్రేణిని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి శ్రీ అనురాగ్ సింగ్ ఠాకూర్ ఈ రోజు ప్రారంభించారు. జింగా ఇండియా సహకారంతో ఆన్‌లైన్ విద్యా మొబైల్ గేమ్‌ల శ్రేణిని అభివృద్ధి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ అపూర్వ చంద్ర తో పాటు జింగా ఇండియా కంట్రీ హెడ్ శ్రీ కిషోర్ కిల్లీ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో ప్రసంగించిన శ్రీ అనురాగ్ ఠాకూర్ స్వాతంత్ర్య సంగ్రామ ఘట్టాలను గుర్తు చేసుకుని, స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు అర్పించి, స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని అంతగా గుర్తింపుకు నోచుకోని సమరయోధుల కథలను వెలుగులోకి తీసుకు వచ్చేందుకు జరుగుతున్న కృషిలో భాగంగా మొబైల్ ఆటలు రూపొందించామని అన్నారు.

భారతదేశంలో ఆన్‌లైన్ క్రీడలకు ఉన్న మార్కెట్ అవకాశాల ద్వారా ప్రయోజనం పొందడంతో పాటు ప్రజలకు ఆటల ద్వారా అవగాహనను కల్పించాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమం ప్రారంభించామని శ్రీ ఠాకూర్ పేర్కొన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని అంతగా గుర్తింపుకు నోచుకోని సమరయోధులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని వివిధ ప్రభుత్వ శాఖలు సేకరించాయని మంత్రి వివరించారు. అనేది ఈ జ్ఞానానికి సంబంధించిన అంశాలను ఆకర్షణీయంగా రూపొందించి సమగ్ర వివరాలతో ఆజాదీ క్వెస్ట్ రూపొందిందని మంత్రి వివరించారు. అన్ని వయసుల వారు ఈ ఆటల పట్ల ఆకర్షితులు అవుతారని అన్నారు. కుటుంబ సభ్యులందరూ ఆటలకు ఆకర్షితులవుతారన్న విశ్వాసం వ్యక్తం చేశారు.

భారతదేశంలో ఏవిజిసి రంగం అభివృద్ధి చెందుతున్నదని శ్రీ ఠాకూర్ అన్నారు. భారతదేశంలో ఏవిజిసి రంగం మరింత అభివృద్ధి సాధించేందుకు అవసరమైన సహకారాన్ని సమాచార మరియు ప్రసార మంత్రిత్వ శాఖ అందిస్తున్నదని హామీ ఇచ్చారు. గత కొన్నేళ్లుగా గేమింగ్ రంగంలో ప్రపంచంలో మొదటి 5 స్థానాల్లో భారతదేశం స్థానం సాధించిందని శ్రీ ఠాకూర్ తెలిపారు. గేమింగ్ రంగం 2021లోనే 28% వృద్ధి చెందిందాని మంత్రి వెల్లడించారు. ఆన్‌లైన్ లో ఆటలు ఆడుతున్న వారి సంఖ్య 2020తో పోల్చి చూస్తే 2021లో 8 శాతం వరకు పెరిగిందని తెలిపారు. 2023 నాటికి ఆన్‌లైన్ లో ఆటలు ఆడుతున్న వారి సంఖ్య 45 కోట్లకు చేరుతుందని మంత్రి తెలిపారు.

కొత్తగా ఆవిష్కరించిన యాప్‌లు దేశ ఏవిజిసి రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు అద్భుతమైన చరిత్రను ప్రపంచం నలుమూలలకు తీసుకు వెళతాయని ఆయన పేర్కొన్నారు. ఈ యాప్‌లలో పొందుపరిచిన సమాచారాన్ని పబ్లికేషన్స్ డివిజన్ మరియు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్ క్రోడీకరించి పొందుపరిచాయని మంత్రి తెలిపారు. మన స్వాతంత్ర్య పోరాటానికి సంబంధించిన ప్రామాణికమైన సమాచారం సులభంగా లభిస్తుందని తెలిపిన మంత్రి సమాచారం జ్ఞాన నిధిగా ఉంటుందని అన్నారు.

ఈ యాప్‌లను రూపకల్పనలో జింగా ఇండియా చేసిన కృషిని మంత్రి అభినందించారు. అన్ని వయసుల వారు ఈ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలని మంత్రి కోరారు. దేశ స్వాతంత్ర్య పోరాటం గురించి తెలుసుకోవడానికి ఒక ముఖ్యమైన విద్యా సాధనంగా యాప్ మారుతుందని అన్నారు.

యాప్ ఏకకాలంలో వినియోగదారులను అలరిస్తుంది, నిమగ్నం చేస్తుంది మరియు అవగాహన కల్పిస్తుంది.

కార్యక్రమంలో మాట్లడిన జింగా ఇండియా కంట్రీ హెడ్ శ్రీ కిషోర్ కిల్లీ స్వాతంత్ర్య సంగ్రామం భారతదేశ చరిత్రలోకీలక ఘట్టంగా ఉంటుందని అన్నారు. చరిత్రను గౌరవించేందుకు జరుగుతున్న ప్రయత్నాల్లో తమ సంస్థకు స్థానం లభించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఆటల ద్వారా ప్రజల మధ్య సంబంధాలు మెరుగుపరిచేందుకు జింగా కృషి చేస్తున్నదని వివరించారు. ఆటల ద్వారా అన్ని వయస్సుల వ్యక్తులను అలరించి, ఆటలను బోధనా అనుభవంగా మార్చాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టామని అన్నారు.

భారతదేశ స్వాతంత్ర్య పోరాట ఘట్టాలను, స్వాతంత్ర్య సమరయోధుల పరాక్రమాన్ని ప్రదర్శించే ఆటలు మరియు బొమ్మలు అభివృద్ధి చేయాలని ఆటలు, బొమ్మల తయారీ రంగానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపును స్ఫూర్తిగా తీసుకుని ఈ ఆటలు రూపుదిద్దుకున్నాయి. . 'ఆజాదీ క్వెస్ట్' సిరీస్‌లోని మొదటి రెండు గేమ్‌లు భారత స్వాతంత్ర్య పోరాట కథలు వివరిస్తాయి. కీలకమైన మైలురాళ్లు మరియు హీరోలను హైలైట్ చేస్తూ, సరదాగా గేమ్‌ప్లేతో అల్లుకున్నాయి. గేమ్‌ల ఇతివృతం సరళంగా సమగ్రంగా ఆకర్షణీయంగా ఉంటుంది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్ నిపుణులు పరిశీలించి ధ్రువీకరించిన అంశాలను పబ్లికేషన్స్ విభాగం ఆటల్లో పొందుపరిచింది.

ఆజాదీ క్వెస్ట్ గురించి:

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా వరుస గేమ్‌లను అభివృద్ధి చేసేందుకు పబ్లికేషన్స్ విభాగం ఈరోజు జింగా ఇండియాతో ఎంఓయూపై సంతకం చేసింది. ఆజాదీ క్వెస్ట్ గేమ్‌లు ఆండ్రాయిడ్ మరియు ఐఓఎస్ పరికరాల కోసం ఆంగ్లం మరియు హిందీలో భారతదేశంలోని ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. సెప్టెంబర్ 2022 నాటికి ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులోకి వస్తాయి. ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీ జింగా ఇండియా 2010లో బెంగళూరులో స్థాపించబడింది. ప్రజాదరణ పొందిన అనేక మొబైల్ మరియు వెబ్ గేమ్‌లను జింగా అభివృద్ధి చేసింది.

'గేమిఫికేషన్ ఆఫ్ ఎడ్యుకేషన్' అనే ఇతివృత్తం ఆధారంగా రూపొందిన గేమ్ సిరీస్ దేశంలో విద్యా రంగంలో విప్లవాత్మక మార్పు తీసుకొస్తుంది. ఆట –ఆధారిత అభ్యాసం తరగతి గది మరియు వయస్సు పరిధి దాటి విస్తరించడం ద్వారా అభ్యాస ప్రక్రియను, జీవితకాల విద్యను అందిస్తుంది. ఆజాదీ క్వెస్ట్ సిరీస్ భారతదేశ స్వాతంత్ర్య పోరాటం మరియు దేశ స్వాతంత్ర్య సమరయోధుల ఇతిహాసాల జ్ఞానాన్ని అందిస్తుంది. దీనితో ఆట ఆడేవారు గర్వంతో గతాన్ని గుర్తు చేసుకుని తమ కర్తవ్యాన్ని తెలుసుకొనేందుకు వీలు కలుగుతుంది. ప్రధానమంత్రి తన 76వ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రస్తావించిన 'పంచ్ ప్రాణ్ ఆఫ్ అమృత్ కాల్' గుర్తు చేసి వలసవాద మనస్తత్వాన్ని తొలగించడంలో కీలకంగా ఉంటుంది.

ఆజాది క్వెస్ట్ సిరీస్‌లోని మొదటి గేమ్ – మ్యాచ్ 3 పజిల్ : 1857 నుండి 1947 వరకు సాగిన భారతదేశ స్వాతంత్ర్యం యుద్ధం వివరాలను ఆటగాళ్లకు సులభంగా అర్థమయ్యే రీతిలో సాధారణ గేమ్‌గా మ్యాచ్ 3 పజిల్ రూపొందింది. 495 స్థాయిలలో గేమ్ ఉంటుంది. ఆటలో పురోగమిస్తున్న ఆటగాళ్ళు 75 ట్రివియా కార్డ్‌లు సేకరించగలరు. ఒకో కార్డు చరిత్రలో కీలక ఘట్టం కలిగి ఉంటుంది. లీడర్‌బోర్డ్‌లలో పోటీపడి, ఆటలో పొందిన రివార్డ్‌లు, ప్రగతిని మరియు సోషల్ మీడియాలో పంచుకోవచ్చు.

ఆజాదీ క్వెస్ట్: హీరోస్ ఆఫ్ భారత్ 75 స్థాయిలలో 750 ప్రశ్నల ద్వారా భారతదేశ స్వాతంత్ర్య వీరుల గురించి ఆటగాళ్ల జ్ఞానాన్ని పరీక్షించడానికి క్విజ్ గేమ్‌గా రూపొందించబడింది. మరియు 75 'ఆజాదీ' ద్వారా అంతగా తెలియని హీరోల గురించి తెలియజేస్తుంది. .

వీర్ కార్డ్‌లు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో భాగస్వామ్యం చేయబడతాయి.

పబ్లికేషన్స్ విభాగం మరియు జింగా ఇండియా మధ్య ఏడాది పాటు కొనసాగే భాగస్వామ్యం మరిన్ని గేమ్‌లను అందిస్తుంది.భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో విభిన్న అంశాల గురించి ప్రజలు ముఖ్యంగా విద్యార్థులు మరియు యువతకు అవగాహన కల్పించడానికి మరియు దేశభక్తి భావాన్ని పెంపొందించే దృష్టితో రూపొందిన అంశాలు, మరియు ఫీచర్ల పరంగా ఇప్పటికే ఉన్న గేమ్‌లను విస్తరిస్తుంది. ఆజాదీ క్వెస్ట్‌ను పూర్తి చేసిన వారికి సర్టిఫికేట్‌తో సహా ప్రతి నెలా గేమ్‌లు ఆటగాళ్లకు ఉత్తేజకరమైన రివార్డులను అందిస్తాయి.

# రాష్ట్రంలో 33 బీసీ స్టడీ సర్కిల్స్, 15 బీసీ డిగ్రీ కళాశాలలు మంజూరు : మంత్రి గంగుల



కరీంనగర్ , ఆగష్టు 25: రాష్ట్రంలో మరో 33 బీసీ గురుకుల విద్యాలయాలు, 15 బీసీ డిగ్రీ కళాశాలలను సీఎం కేసీఆర్ మంజూరు చేశారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో సీఎం కేసీఆర్ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, అందులో బీసీల విద్యపై ప్రధానంగా దృష్టి సారించారని అన్నారు.

గురువారం కరీంనగర్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాకముందు రాష్ట్రంలో కేవలం 19 బీసీ గురుకులాల్లో కేవలం 7,500 మంది మాత్రమే చదువుకునే వారని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ చొరవతో 261 బీసీ గురుకులాలు ఏర్పడ్డాయని, ఇందులో ప్రస్తుతం 1,52,440 మంది బీసీ బిడ్డలు విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు.

స్వాతంత్ర్యం సిద్ధించిన 70 ఏండ్లలో కేవలం 19 బీసీ గురుకులాలు ఏర్పడగా తెలంగాణ ఏర్పడిన ఆరేండ్లలోనే 261 గురుకులాలను ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్ దే అన్నారు. కొత్తగా మరో 33 బీసీ గురుకులాలను, 15 బీసీ డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేశారని, దీంతో 294 గురుకులాలు, 16 డిగ్రీ కళాశాలలు పనిచేస్తాయన్నారు.

కొత్తగా ఏర్పాటు చేసిన ప్రతి గురుకులంలో 240 సీట్లు, డిగ్రీ కళాశాలలో 1200 సీట్లు ఉంటాయన్నారు. గురుకులాల్లో 5,6,7వ తరగతుల నుంచి ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం డిమాండ్ ఉన్న 8 కోర్సులను డిగ్రీ కళాశాలల్లో ప్రవేశ పెడతామని మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు.

గురుకులాలను ప్రతి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని, తాత్కాలికంగా అద్దె భవనాల్లో ఏర్పాటు చేసేందుకు అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చామన్నారు.

గురుకుల హాస్టళ్లలో నాణ్యమైన భోజనం, మెరుగైన సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. సమావేశంలో చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జడ్పీ అధ్యక్షురాలు కనుమల్ల విజయ, ఎస్సీ కార్పోషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, కరీంనగర్ మేయర్ వై సునిల్ రావు ఉన్నారు.

# బాలకాండ అఖండ పారాయణంతో మార్మోగిన తిరుమల గిరులు

తిరుమల, ఆగష్టు 25: ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలో 11వ విడత బాలకాండ అఖండ పారాయణం భక్త జనరంజకంగా సాగింది. బాలకాండలోని 50 నుంచి 55 సర్గల వరకు గల 153 శ్లోకాలను వేద పండితుల అఖండ పారాయణంతో తిరుమల గిరులు మార్మోగాయి. నాదనీరాజనం వేదికపై గురువారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు కొనసాగింది.

విశేష సంఖ్యలో భక్తులు హాజరై శ్రీనివాసుడి నామస్మరణం చేయడంతో తిరుమల పులకించి పోయింది. బాలకాండ పారాయణం నిర్వహిస్తున్నఎస్వీ వేద విశ్వవిద్యాలయం ఆధ్యాపకులు ఆచార్య ప్రవా రామకృష్ణ సోమయాజులు మాట్లాడుతూ.. మన పూర్వీకులు మనకు అందించిన మంత్రోచ్చారణ దివ్యశక్తిని కలిగిస్తుందని, దీనితో సమస్త రోగాలను నయం చేయవచ్చని తెలిపారు. అనాదికాలం నుంచి మానవులు రామాయణం విని, పారాయణం చేయడం వలన బాధలు తొలగి, సుఖ సంతోషాలతో ఉన్నట్లు పురాణాల ద్వారా నిరూపితమైనదన్నారు. వాల్మీకి మహర్షి శ్రీరామచంద్రమూర్తిని ఆశ్రయించినట్లు, యావత్ ప్రపంచం రాముడి ఆశ్రయించి, రామనామం పలికితే సకల శుభాలు సిద్ధిస్తాయని వివరించారు. అఖండ పారాయణంలో ధర్మగిరి వేద పాఠశాల, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం అధ్యాపకులు, ఎస్వీ ఉన్నత వేద అధ్యయన సంస్థకు చెందిన వేద పారాయణ దారులు, రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయంకు చెందిన పండితులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, పండితులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# రాతపరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగొద్దు : ఎస్పీ డా.వినీత్

**– పరీక్షా కేంద్రాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలి**

**– జిల్లా వ్యాప్తంగా 49 పరీక్షా కేంద్రాల్లో హాజరుకానున్న 17,077 మంది అభ్యర్థులు**






భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 25 (నేటినిజం ప్రతినిధి) : ఈ నెల 28వ తేదీ ఆదివారం జరగనున్న కానిస్టేబుల్ ప్రిలిమినరీ రాత పరీక్షకు సంభందించి జిల్లా వ్యాప్తంగా 49 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ డా.వినీత్.జి ఐపీఎస్ గురువారం కెఎస్ఎం కళాశాలలో పరీక్షా కేంద్రాల రీజనల్ కో – ఆర్డినేటర్స్, చీఫ్ సూపరింటెండెంట్స్, అబ్జర్వర్స్, పోలీసు అధికారులతో అవగాహనా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షా సమయం, ఈ రాత పరీక్షకు నోడల్ అధికారిగా ఏఆర్ అడిషనల్ ఎస్పీ డి. శ్రీనివాసరావు వ్యవహరిస్తారని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కొత్తగూడెం మరియు పాల్వంచ పరిధిలోని 39 పరీక్షా కేంద్రాలలో 14,221 మంది, భద్రాచలంలో ఏర్పాటు చేసిన 10 కేంద్రాలలో 2856 మంది అభ్యర్థులు ఈ రాత పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. బయోమెట్రిక్ విధానం ద్వారానే అభ్యర్థులను పరీక్షా హాలులోకి అనుమతించడం జరుగుతుందని తెలియజేశారు. కొత్తగూడెం రీజియన్ నందు ఏర్పాటు చేసిన 39 పరీక్షా కేంద్రాలకు మైనింగ్ కళాశాల ప్రిన్సిపల్ పున్నం చందర్, భద్రాచలం నందు ఏర్పాటు చేసిన 10 కేంద్రాలకు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ భద్రయ్య, రీజనల్ కో – ఆర్డినెటర్స్ గా వ్యవహరిస్తారని తెలిపారు. 49 పరీక్షా కేంద్రాలకు 49 మంది చీఫ్ సూపరింటెండెంట్స్ మరియు 49 మంది అబ్జర్వర్సుగా వ్యవహరిస్తారని తెలియజేశారు. ఈ రాత పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని రకాల సదుపాయాలను ఏర్పాటు చేయాలని పాల్గొన్న అధికారులకు సూచించారు.

ఈ సందర్భంగా రాత పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు కొన్ని నియమ నిబంధనలను పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

లిలిలి.బిబశ్రీజూతీఎ.తిని వెబ్సైట్ ద్వారా డౌన్లోడ్ చేసుకున్న హాల్ టికెట్ పై నిర్దేశిత స్థలంలో అభ్యర్థి పాస్ పోర్ట్ సైజ్ ఫోటో ఖచ్చితంగా అతికించుకోవాలి.

అభ్యర్థులు హాల్ టికెట్ తో పాటు బ్లూ అర్ బ్లాక్ బాల్ పాయింట్ పెన్నులను మాత్రమే వెంట తెచ్చుకోవాలి.

అభ్యర్థులు సెల్ఫోన్, టాబ్లెట్, పెన్ డ్రైవ్, బ్లూటూత్ డివైస్, చేతి గడియారం, క్యాలిక్యులేటర్ లాగ్ టేబుల్, వాలెట్, పర్స్ నోట్స్, ఛార్జ్, రికార్డింగ్ పరికరాలు, ఖాళీ పేపర్లను వెంట తీసుకు రాకూడదు.

ఎలాంటి ఆభరణాలు ధరించరాదు. హ్యాండ్ బ్యాగ్, పౌచ్ లు లాంటివి తీసుకురావద్దు. భద్రపరిచేందుకు పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి క్లాక్ రూములు ఉండవు.

బయోమెట్రిక్ నేపథ్యంలో అభ్యర్థులు చేతివేళ్ళకు మెహంది, టాటూలు లేకుండా చూసుకోవడం తప్పనిసరి

ఓఎంఆర్ షీట్స్ పై అనవసర రాతలు, గుర్తులు, మత సంబంధ అంశాల్లాంటివి రాస్తే మాల్ ప్రాక్టీస్ గా పరిగణిస్తారు.

పరీక్షలో నెగిటివ్ మార్కులు ఉన్నందున అభ్యర్థులు జాగ్రత్తగా సమాధానాలు టిక్ చేయాల్సి ఉంటుంది. ఇంగ్లీష్,ఉర్దూ భాషల్లో ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్నల్లో ఏవైనా సందేహాలు ఉంటే ఇంగ్లీష్ వర్షన్ నే పరిగణలోకి తీసుకోవాలి.

ఈ సమావేశంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, భద్రాచలం ఏఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్, కొత్తగూడెం డిఎస్పీ వెంకటేశ్వర బాబు, పాల్వంచ డిఎస్పీ సత్యనారాయణ, ఎస్బి ఇన్స్పెక్టర్ స్వామి, ఐటి సెల్ ఇన్స్పెక్టర్ నాగరాజు, ఆర్ఐలు సోములు, కామరాజు, దామోదర్, నాగేశ్వరరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బీజేపీ మత రాజకీయాలు చేస్తున్నది : మంత్రి సత్యవతి




బాసర, ఆగష్టు 25: రాష్ట్రంలో బీజేపీ కుల, మత రాజకీయాలు చేసి ప్రజలను రెచ్చగొడుతున్నదని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ఫైర్ అయ్యారు. గురువారం నిర్మల్ జిల్లా బాసరలోని శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారిని దర్శించుకుని, తన మనవరాలు కియారాకు అక్షరశ్రీకార పూజలు నిర్వహించారు.

అనంతరం విలేకరులతో మాట్లాడారు. బండి సంజయ్.. పాదయాత్రకు బదులు మోకాళ్ల యాత్ర చేయాలి. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి రాష్ట్రానికి రావాల్సిన వాటా తీసుకురావాలన్నారు. బీజేపీ నాయకులకు రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్తారన్నారు. కేసీఆర్ కుటుంబ సభ్యులపై బీజేపీ నాయకుల ఆరోపణలు సబబు కాదని, ఇలాంటివి చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

బాసర ట్రిపుల్ ఐటీలోని విద్యార్థులు సంయమనం పాటించాలని, తమ ఉన్నతమైన భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని, వారికి ఒక అమ్మలా చెప్తున్నాని సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను ఒక్కొక్కటి పరిష్కరిస్తున్నదని, విద్యార్థి ఆత్మహత్యకు తన సంతాపాన్ని ప్రకటించారు.

